దీపావళి నవల

# ఉదయరాగం

## ఆదివిమధ్యాం రమణమ్మ

తూరుపుదిక్కు తెల్లగా ముఖం కడుక్కుంది. బొట్టు దిద్దుకోడానికి కుంకుమ అరచేతిలో పోసుకుంది. ఆ కాంతిరేఖలు ఆ కుగ్రామాన్ని వెలుగుతో నింపుతున్నాయి. ఆ కుంకుమ రాగం, వారి గుండెల్లో అనురాగాన్ని పంచుతోంది.

తిరుపతమ్మ దొడ్డి గుమ్మంవైపు కసువూడుస్తూ మేలుకొలుపు అందుకుంది—

"చాలా తెల్లవారె సామీ శ్రీ రామాచంద్రా, చాలించు నీ నిద్ర మేలుకో" అన్నపాట తీయగా సాగుతోంది—

వారి దొడ్డి గుమ్మానికెదురుగా ఉన్న ఇంట్లో వీధరుగు నానుకొనివున్న కచేరీ గదిలో నిద్రపోతున్న కిష్టయ్యగారికీ గానం వినిపించగానే మెళుకువ వచ్చేసింది. మంచినిద్ర పాడైనందుకు విసుగ్గానూ ఉంది. తిరుపతమ్మ గానం తీయగానూ పిలుస్తోంది.

కిష్టయ్యగారు లేవక తప్పలేదు.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని లేచారు. మంచం ప్రక్కనే ఉన్న గూట్లోంచి పందుం బుల్ల అందుకున్నారు. పందుం బుల్ల నములుతూ, ముసిముసిగా నవ్వుతూ వీధి అరుగుమీదకొచ్చారు.

"తిరుపతమ్మా! అపుడే తెల్లారిందీ నీకు? మేలుకొలుపులు పాడుతున్నవ్?"

"ఆఁ నాకు తెల్లారింది. నీకెలా తెల్లారుతుంది? ఎంతయినా మగధీరుడివి. ఇష్టంవచ్చినపుడు లేస్తావ్. అయినా మేలుకొలుపులు నీకాండులే. రామయ్యకి" కిలకిలా నవ్వింది.

ఆమె మాట్లాడుతుంటే సొగసుగా మూతి విరుస్తుంది. చిత్రంగా చేతులు తిప్పుతుంది.

ఆ అందాలు చూస్తూ క్షణం మాట్లాడ్డం మరిచాడు.

"ఆ పిలుపులు ఎవరికయితే ఏంలే. నాకొచ్చి అందుతున్నాయి. మంచినిద్ర పాడుచేశావ్ కదా. మీ ఆడవాళ్ళేం తక్కువ తిన లేదులే. అందాలకి ముసుగులు వేసుకుంటారు. ఆ ముసుగుల్లోంచి మెరుపులా తళుక్కున మెరుస్తారు."

"పిలుస్తారు కూడా అని గట్టిగా అరవకయ్యోయ్. నీకు పుణ్యముంటుంది. ఏం చేస్తాం. మీ మగవాళ్ళు మమ్మల్ని ముసుగుల్లో కప్పెట్టాక? ప్రొద్దున్నే నీపాడు బుద్ధి వీధందరికీ వినిపించకు. నీ పని చూసుకో. పాలేర్లని పిలుచుకో" అని విసురుగా చీపురు చిన్నరుగు మీదకు విసిరి వయ్యారంగా వంగి పేడ బిందెలో కలపబోతుంటే,

"ఆగు, తిరుపతమ్మా! పేడ అప్పుడే కలిపెయ్యకు చెంబుడు నీళ్ళు ఈ దాసుడికి సత్కరించు"

అందెలు గొలుసులు చప్పుడు చేసుకుంటూ ముసిముసిగా నవ్వుకుంటూ చెంబుతో నీళ్ళు అందించింది.

తరువాత కిష్టయ్యగారి దగ్గరగా వచ్చి,

"నీవు నిద్రపోతున్నవని, ఊరు నిద్రపోతుందను

కున్నావా? అందరూ చూసేటప్పుడు, వినేటప్పుడు మనసు దాచుకోలేవూ? ఎందుకు పరువు తీస్తావ్?"

"మనకి పరువేం పోదులే తిరుపతమ్మా! పోయినా వర్లేదు. మన ముఖాన్ని ఎవరయినా ఏమయినా అనడానికి గుండా, చెరువా? సరేగాని పరమాన్నం ఎప్పుడు వండుతావ్?"

"ప్రొద్దున్నే పరమాన్నానికి ముఖం వాచెందుకుగాని ఇంట్లోకెళ్ళి పాలుత్రాగు. పరమాన్నం చేసినప్పుడు పిలుస్తాలే" అని సన్నగా నవ్వుతూ భూమి అదిరేలా నడుస్తూ తన గుమ్మం లోకి పోయింది.

కిష్టయ్యగారు ముఖం కడుక్కోవడం పూర్తిచేసి పై పంచెతో ముఖం తుడుచుకుని పెద్దగొంతుతో "నారయ్యా! రామిగా!" అని పొలికేకలు వేసి పిలిచారు.

కూత వేటు దూరంలో పాలేర్ల పాకలు వున్నాయి. ఆయన అరుపు సింహగర్జనే. ఇంట్లో వాళ్ళు, బయటవాళ్ళు కూడా అదిరిపడి లేస్తారు ఆయన కేకలకి. వాళ్ళకింక గుండెలు వేగంగా కొట్టుకోవలసిందే విద్రమత్తు ఎక్కడా నిలవదు

## 2

కిష్టయ్యగారు ఆ గ్రామానికి మకుటంలేని మహారాజు. ఆయనకి మంచి నడివయసులో భార్య పోయింది. ఇద్దరు ఆడ పిల్లలు, ఇద్దరు మగపిల్లలు. పెద్దకొడుక్కి పెళ్ళి అయింది. అతని కిద్దరు పిల్లలు, చిన్నవాళ్ళు. రెండో కొడుకు రాజ మండ్రిలో వున్నాడు, అక్కడ చదువుతున్నాడు.

కూతుళ్ళకు పెళ్ళివయసు వచ్చిందిగాని పెళ్ళికాలేదు. పెద్దమనుషులు కాకుండా పెళ్ళికావాల్సిన రోజులు. ఇద్దరిలో ఒక అమ్మాయి పెద్దమనిషి అయింది కాని దాచేశారు.

ఇంట్లో ఈ ఆడవాళ్ళు కాక, మరో ఆవిడ ఉంది. దూరపు బంధువు. భార్య పోగానే పెద్దదిక్కుగా ఉంటుందని తెచ్చుకున్నారు. ఆవిడ తన సంతానాన్ని చిన్న పిల్లలుగా ఉన్నప్పటినుంచీ సాకుతూ వండి వారుస్తోంది. ఇపుడు కోడలు అందుకుంది.

స్వంత వ్యవసాయం. పాడి, పంట, పాలేర్లు అన్ని హంగులు ఉన్నాయి.

కోడలు ఇంటి పనుల్లో సహకరిస్తుంది గాని, కొడుకు తన వ్యవసాయం పనుల్లో సాయంరాడు. తనంటె భయ భక్తు లున్నాయిగాని, మంచి అలవాట్లు లేవు. తను కనుమరుగయి నపుడు, నిద్రపోయినపుడు, నలుగురు మిత్రులతో ఇంట్లోనే పేకాట పెడతాడు. తను ఇంట్లోనే ఉన్నపుడు, వీధినబడి మరొ కరింట్లో పెడతాడు.

ఇక భార్య పుట్టింటికి వెళ్ళినపుడు, పురుళ్ళు పుణ్యాలు వచ్చినపుడు ఇంట్లో పడుకోడు. అలాంటివి లేనపుడు ఇంట్లోనే పడుకుంటాడు.

కిష్టయ్యగారు ఈ విషయంలో కొడుకును మందలించ డానికి లేదు. మరి తనకీ ఇలాంటి చీకటి అవసరాలు ఉన్నాయి తనకి భార్య లేదు, మరి వాడి కుంది. "ఏం పొయ్యేకాలం! ఆ కాసిని రోజులూ ఓర్చుకోలేడూ!"


అని తనకనిపిస్తుంది ఆ మాట పైకి అంటే తనపరువు



తీస్తాడు. అందుకే ఆ విషయాలు వదిలి, మిగతా విషయాల్లో గట్టిగానే మందలిస్తూ ఉంటాడు.

"అస్తమానూ ఆ వెధవపేకాటలో చావకపోతే, మిరప చేలు కోసేటప్పుడూ, బేరన్ పుగాకు, కాల్చేటపుడూ జాగ్రత్తగా చూడకూడదూ? దగ్గరుండి." అని కోప్పడతాడు.

కిష్టయ్యగారు అహర్నిశలూ శ్రమపడతారు. పంటలు పండిస్తారు. పాలేర్లనీ, కూలీలనీ హడల గొడతారు. కాని,



క్రూరుడు కాదు చచ్చేట్లా పని చేయిస్తారు, చక్కని ఫలితమూ చుట్ట జెబుతారు. అందర్నీ హడలగొడుతూ ఉంటారు. అపై ఉపకారాలూ చేస్తు ఉంటారు. ఆయనకి ఎదురు నిలిచి మాట్లాడే వారు లేరు. ఏ విమర్శలు చేసినా చాటునే. ఊళ్ళో ఏ తగువైనా ఆయనే తీర్చాలి. ఎవర్ని దావాలో నెగ్గించాలన్నా ఆయనే పూనుకోవాలి.

ఆయన ఇల్లు ఊరి సెంటర్ని ఉంది. పురాతనమైన పెంకుటిల్లు. ముందు వీధి అరుగు. అరుగుని ఆనుకొని ఓ ప్రక్కగా కచేరి గది. ఆ కచేరి గది గుమ్మంలోంచే ఇంట్లోకి దారి ఉంది. వీధరుగుకు ఎదురుగా అంటే ఆపోజిట్‌గా వంటిల్లుండేది. అంటే వీధరుగు తూర్పు దిశగా, వంటిల్లు పడమటిల్లు పడమట దిశగా ఉన్నాయి. ఉత్తర దక్షిణ దిక్కుల్లో రెండు వసారాలున్నాయి ఒక వసారాకి ఓ చివర కచేరీ గదీ రెండో చివర దేముని గదీ ఉండే రెండో వైపు వసారా రెండు చివర్లా రెండు గదులూ ఉన్నాయి. అవి రెండూ కొట్టుగదులే. ఒకదాంట్లో ధాన్యం బస్తాలుంటాయి. రెండో దాంట్లో బియ్యం డ్రమ్మూ. పప్పుల డబ్బాలు, మిర్చి, చింతపండు వగైరా సామానులుంటాయి వసారాలకి, వంటింటికి మధ్య చిన్న నలుచదరపు హాలు. హాలుని అనుకుని పడగ్గది.

వీధిలోంచి తిన్నగా ఇంట్లోకి దారిలేదు. ప్రక్కనున్న కచేరీ గదిలోంచే దారి. వీధరుగు, దేముని గది, వంటిల్లు, భోజనాలగది తప్పించి మిగతావన్నీ మట్టివే.

వాటికి గచ్చులు చేయించుదామని అనుకుంటారుగాని చేయించకు పెద్ద కారణం ఏమీ లేదు. ఇంటికి ఏమయినా మార్పులు చేర్పులు చేయిస్తే అశుభమేమైనా జరుగుతుందేమో అని ఆయన సెంటిమెంటు. ఒకసారి అలా చేసినప్పుడే ఆయన భార్య పోవడం జరిగింది అది యాదృచ్ఛిక మనుకోడాయన. అచ్చిరాలేదనుకుంటాడు. ఇల్లు ఎలా వుంటేనేం? ఇంట్లోవాళ్ళు చల్లగావుంటే అంతే చాలనుకుంటాడు.

ఇక ఊరు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక చిన్న పట్నానికి ఏడెనిమిది మైళ్ళ దూరంలో చిన్న కుగ్రామం. అగ్రహారం అనుకుంటే బాగుంటుంది. ఊళ్ళో అంతా కలిసి పది పెంకుటిళ్ళు వుంటాయి. అందులో ఏడెనిమిది బ్రాహ్మణ కొంపలు. వూరంతా కలిపి నాలుగు వీధుల కూడలి. మధ్యన నుయ్యి.

అవసరానికి ఒక తెలుకుల కుటుంబం. ఒక చిన్న కోమటి దుకాణం. కుమ్మర్లు, కమ్మర్లు వున్నారు. మిగతా వారంతా కాపులు, రైతులు, రైతు కూలీలు.

వూరు నానుకుని అతి చేరువగా పొలాలు. పొలాలకి అప్పటికింకా నీటి సౌకర్యాలమరలేదు. నల్లరేగడి నేల. మెట్ట పంటలు. మిరప, పొగాకు, బేరన్ పొగాకు, కంది, పెసర, జొన్న వగైరాలు పండిస్తారు.

స్వాతంత్ర్య పోరాటపు రోజులు. కాంగ్రెసు మహోద్యమం ఉధృతంగా జరుగుతోంది. భూమి సారవంతమైనది. రైతులు బాగా కష్టపడి పనిచేస్తారు. బేరన్ పొగాకు కారణంగా అటు రైతులకు ఇటు కూలీలకు డబ్బు బాగానే గిడుతోంది. ఆడ కూలీలకు కూడా రేటు హెచ్చే. వారి వారికి బాగానే జరిగిపోతోంది.



కాలకృత్యాలు తీర్చుకుని కిష్టయ్యగారు చేలోకి వెళ్లారు. క్కడ కొన్ని పనులు పురమాయించి లేత వంకాయలు, కొత్తిమిర. పచ్చిమిరపకాయలు తుంచి తువ్వాల్లో మూటకట్టి తాజా వంకాయలు కూర వండించుకుందామని ఇంటికి బయలుదేరారు. దారిలో ముసి ముసి నవ్వులతో. మంగమ్మ నిలేసింది.

"ఇదిగో కిష్టయ్యగోరూ! వోపాలి ఇలా వస్తారా?"

వూరికి కొసగా పొలానికి దగ్గరగా మంగమ్మ ఇల్లు వుంది. ఇల్లంటే రెండు గదులు పాక.

పొడుగ్గా సన్నగా వీధరుగు. వీధి గుమ్మంలోంచి లోపలి కెళ్ళగానే అదే మాదిరి సన్నగా పొడుగ్గా గది. ఆ గదికి వో చివర్ల పెరట్లోకి గుమ్మం. గుమ్మం ప్రక్క చిన్నపంచ. పెరటు. ఆ పంచలోనే పొయ్యి. అక్కడే వంట వగైరాలు. వంట సామానులన్నీ గదిలోనే. అన్నీ ఇత్తడి, రాగివి. గది నున్నగా అలికి సిమ్మెంటుతో చెక్కతాపీ వేసినట్లు వుంటుంది. ఇహ సామానులు. దెగిసాలు. కాగులు. చిన్న గుండిగలు తెల్లగా తోమి. చిట్టి అటకమీద సుందరంగా పేర్చి వుంటాయి. ఎక్కడా ఇంట్లో చెత్త కనపడదు.

ఇక రెండవ గది. ఆ గదికి వీధి వైపునుంచి దూరం లేదు. వంట సామాను గదిలోంచి దారిలేదు. దానిగుమ్మం వెనక వైపు వుంది. ఆ గదిలోకి వెళ్ళాలంటే సందులోంచి వెళ్ళాలి. గదిలో ఎవరున్నా ఏం జరుగుతున్నా రెండో కంటికి తెలియడానికి వీలులేదు. గదిలో చాలా చల్లగా వుంటుంది.

పట్టెమంచం. తెల్లని పక్క. ఎప్పుడూ వేసి వుంటాయి. ఆ గదిలోనూ చిట్టి అటకమీద కొంత సామాను పేర్చివుంది. కూర్చోడానికి కుర్చీలు వగైరాలు లేవుగాని, మంచి చేవకర్రది పెద్ద పెట్టె వుంది. అదే. ఏం దాచుకోవాలన్న ఉపయోగించాలి. ఆ పెట్టెమీదే ఎవరొచ్చినా కూర్చునేది.

అదీ మంగమ్మ ఇల్లు.

"ఊఁ దారిలో నిలేసావు. ఏంటి సంగతి?" అన్నారు కిష్టయ్యగారు.

చెంగు నిండా కప్పుకుని "సంగతే మరి" అని చిరు నవ్వు నవ్వి వూరుకుంది మంగమ్మ.

"కూర కోడలికి ఇచ్చి వస్తానుండు" అని చకచకా ముందుకు అడుగు వేసారు కిష్టయ్యగారు.

ఇంట్లోకి వెళ్ళగానే కోడల్ని పిలిచి "ఇదిగో శాంతమ్మ ఈ వంకాయలు. కొత్తిమీర కారం పెట్టి వండు మరి పోపు సామాన్లు వెయ్యకు"

"అలాగే మామయ్యా" అని కొంగు నిండా కప్పుకుని వంకాయలు అందుకుంది.

వచ్చినంత వేగంగానూ వెనుదిరిగి, నాలుగు అంగల్లో మంగమ్మ ఇంటికిచేరి, అటూ ఇటూ చూసి లోపలికి దూరారు.


పాక, సందుగదిలో ప్రవేశించి మంచం మీద చతికిల బడ్డారు. ఎండలోంచి వచ్చారేమో గది చల్లగా, హాయిగా వుందాయనకి. నెమ్మదిగా పక్కమీద మేనువాల్చి మంచినీళ్ళు అడిగారు.

అడగడమే తడవుగా మిలమిల మెరుస్తున్న రాగిచెంబుతో చల్లని మంచినీళ్ళు తెచ్చి అందించింది మంగమ్మ.



# కార్బన్ కాగితం

పగలంతా సూర్యుడు
వేన వేల కిరణాల కలాలతో వ్రాసిన
వెలుతురు అక్షరాలు



రాత్రంతా జ్వలిస్తాయి
లక్షల నక్షత్రాలుగా
దివారాత్రముల నడుమ దాగిన
కార్బన్ కాగితం-
చీకటి.

—కె. దినకర్

అని త్రాగి కాస్సేపు కళ్ళు మూసుకుని ఆ తరువాత లేచి కూర్చున్నారు.

"ఇదిగో మంగమ్మా! వేళాపాళా లేకుండా పిల్చి నా పరువు తియ్యకు. నా అవసరాలు ఎలా ఏడుస్తున్నా పరువుగానే బ్రతుకుతున్నాను. ఇప్పుడు కొంపేం మునిగిందని ఇంటికి పిల్చావ్? ఏదైనా పని వుంటే మా ఇంటి దగ్గరే అఘోరించొచ్చుగా" అని విసుక్కున్నారు.

ఆ విసుగుకి కాస్త చిన్నబుచ్చుకుంది మంగమ్మ. అయినా వెంటనే తేరుకుని చిన్నగా నవ్వుతూ చెప్పింది.

"నేను మాత్రం చీటికీ, మాటికీ మీ ఇంటి కొస్తే ఏం బాగుంటుంది?"

"సరేలే. అసలు సంగతి చెప్పు"

"చెప్పడానికేం ఉంది. ఆ దావా సంగతి ఏం జేసావంట? మా అప్ప కాస్త సొమ్ము పంపింది. అట్టిపెట్టుకోడానికి నా దగ్గరేటుంది? ఉన్నదంతా నీకే ఇచ్చానయ్యో"

"నీ ఇల్లు బంగారం గానూ, ఇందుకా పిలుస్తే? దావా సంగతి మాట్లాడడానికి ఇంట్లోకెందుకే." అని పకపకనవ్వారు విలాసంగా, మీసం దువ్వుకుంటూ.

ఆ వ్యంగ్యం మంగమ్మకు అర్థం అయింది.

తనూ కిల కిలా నవ్వేసింది ఆమె పలువరస మల్లె మొగ్గల్లా మెరిసాయి

"ఇంట్లోకి పగలైనా, రేతిరైనా, నేనెందుకు పిలుస్తా? నువ్వే వస్తావు. నేను పిలిచేది ఇంకో యవ్వారం మాట్లాడదారనీ"

"సరేలే దాని సంగతి నువ్వస్తమానూ చెప్పక్కర లేదులే. చూడు! రెండు అరిసెలేమైనా ఉంటే పట్రా. ఆకలేస్తోంది" అన్నాడు.

సందుం పెట్టె ఎక్కి అటకమీదున్న చిన్న బిందె దింపింది. వాని విప్పి, రెండు అరిసెలు తీసింది వంటింటివేపు వెళ్ళి పళ్ళెంలో కాసిని అటుకులు వేసి తెచ్చిపెట్టింది. కిష్టయ్యగారి ఆకలి మరోదారికి మళ్ళింది.

అందుకు కారణం! అటకమీద బిందె అందుకుంటున్నపుడు మంగమ్మ అంగ సౌష్టవం కళ్ళ విందుగా కళ్ళబడ్డమే. అది ఆయన మగతనాన్ని మరీ మరీ కవ్వించింది.

ఆ ఏకాంతంలో ఏమిచేసినా పట్టించుకొనేవారు లేరు. కాని కిష్టయ్యగారు సమయమూ సందర్భమూ పాటిస్తారు.

మంగ ఎప్పుడూ తెల్ల మల్లెపువ్వులా, కడిగినముత్యంలా ఉంటుంది. తానే పొలం పనుల్లో చెమటపట్టి అసహ్యంగా ఉన్నారు.

స్నానం అదీ కాలేదు సమయం కాని సమయంలో- మంగ అసందర్భంగా పిలిచినందుకు చిరాకుపడ్డారు. మంగ చిరునవ్వులు ఆయన్ని కవ్వించి మరింత బాధ పెడుతున్నాయి.

అరిసెల పళ్ళెం అందుకుని, అరిసెలు ఆవురావురుమంటూ తిని, అటుకుల్ని కసిగా నమలడం మొదలుపెట్టారు. తినడం పూర్తిచేసి, లోటా మంచినీళ్ళు తాగి "ఇదిగో మంగమ్మ! వేళాపాళాలేకుండా ఇంక పిల్చావంటే ఊరుకొనేది లేదు".

"అయ్యో! నీ ఇల్లు బంగారంగానూ! మళ్ళా మొదటి కొచ్చావ్! అన్నీ మింగి నా దావా సంగతి ఏం జేసావంటే అది చెప్పవేం?"

"నీ దావా తగలెయ్య! నువ్వు చెప్పాలిటే. పొలం పనులు తీరాలి, పట్నంవెళ్ళాలి, డబ్బుండాలి. అయినా నువ్వు నన్ను నమ్మాలి మాటి మాటికీ నన్నడగకూడదు."

"ఏం చెయ్యనయ్యా! నా బాధ నాది."

"నీ బాధలు తీర్చడానికి నేనున్నానుగా." మళ్ళీ విలాసంగా నవ్వారు.

అక్కడుంటె మరి నిలదొక్కుకోవడం కష్టమని లేచి నించున్నారు. "మరి నే వెళ్ళొస్తా. పొలంలో మిరపకోత జరుగుతుంది" అని లేచారు.

"అన్నీ మింగాక మాట వినిపించుకోవు. అయినా నీకెక్కడ తీరుద్దిలే, బోల్డు ఎవ్వారాలు నీకు" మూతి మూడు వంకర్లు తిప్పుతూ అంది.

ఇహ మరి నిలవరించుకోలేకపోయాడు. మంగమ్మకి చేరువగా వచ్చి ముఖాన్ని చేతులలోకి తీసుకుని గాఢంగా ముద్దు పెట్టుకున్నారు.

"చాల్లే సరసాల్తో నన్ను చల్లబరిచేస్తావ్. చివరికేం జేస్తావో." అని విదలించేసుకుంది.

ఆయన నవ్వుతూ వీధిలోకి వెళ్ళిపోయాడు.

## 4

మంగమ్మ చిన్నతనంలోనే ముండామోసింది. తల్లి దండ్రులున్నంతకాలం లోటురాలేదు. ఆ తరువాత అప్పగారిల్లు

చేరింది. ఆస్తి, జీవితానికొక ఆధారంకావాలనిపించాయి. అత్త వారు చిల్లిగవ్వ ముట్టచెప్పలేదు. భర్తముఖం దూరం నుంచి చూపిందిగాని, అతను దగ్గరయ్యేవరకు బ్రతకనేలేదు. తల్లిదండ్రులు అత్తవారంత ఆస్తిపరులు కాకపోయినా, దేనికీ లోటు లేదు. బిడ్డకి చిన్నతనంలోనే ఘోరం జరిగినందుకు బ్రతికి వున్నాళ్ళు కుమిలిపోయారు. వాళ్ళ కులంలో మారుమనువులు లేవు. పెద్దింటి వాళ్ళు. అందువల్ల పునర్వివాహ ప్రసక్తేలేదు. తలిదండ్రులు గతించాక అన్నగారు బాగానే చూశారు. కాని వదినగారిదగ్గర నిలదొక్కుకోలేక పోయింది. ఆ తరువాత అక్క గారి ఊరు చక్కావచ్చింది.

అక్కకీ పిల్లలకీ చాకిరీ చేస్తూ చేదోడు వాదోడుగా ఉన్నా బావగారి దగ్గర నిలదొక్కుకోవడం కష్టం అయింది. బావగారికి లొంగిపోతే అక్కకి ద్రోహం అవుతుంది.ఆ పని తనవల్లకాదు. ఏ నాడు ఏ దంపతుల్ని ఎడబాటు చేసిందో. ఈనాడు భర్త సుఖం చూడకుండానే చనిపోయాడు. అందుకని స్వల్పకాలం లోనే ఎదిగొచ్చిన అక్కగారికొడుకుని దత్తతచేసుకుని. అత్తవారి పొలాలున్న ఈ అగ్రహారం వచ్చింది.

అత్తవారి పొలాలైతే ఆ ఊరిలోనే ఉన్నాయి గానీ.అత్త వారు తన భర్తపోయాక ఆ ఊరువదిలి పట్నం వెళ్ళిపోయారు.

ఏ పెద్దలైనా. ఏ రైతులైనా. ఏ కరణమైనా తనకు కాస్త బ్రతుకుతెరువు చూపకపోతారా? ఒక చెక్క భూమి ఇప్పించక పోతారా అన్న ఆశతో ఆ ఊరు వచ్చింది. ఈలోగా అత్త కొడుకు కూలీ నాలీచేసి పోషిస్తాడన్న భరోసా వుంది.

సింహంలా ఊరిని చలాయిస్తూ. పులిలా అరుస్తూ.ఆజాను బాహుడూ, అందగాడూ అయిన కిష్టయ్య ఆమె నాకర్షించాడు ముందు భయభక్తులతో తన దీనగాథ విన్నవించుకుంది. అతడు ఆపాదమస్తకం మంగమ్మను పరిశీలిస్తూ. ఆవిడ దీనగాథ విన్నాడు. మంగ చక్కని చుక్క. అనాఘ్రాత పుష్పం. చక్కని చామనఛాయ శరీరం. కళకళలాడే ముఖం. మెరిసే సోగ కళ్లు. నల్లని కురులు. ఏ అనుభవమూ ఎరుగని నేల రాలి పోతున్న మొగ్గలా కనిపించిందాయనకు.

'ఊహూ ఆ మొగ్గ నేల రాలకూడదు. వసివాడకూడదు. సమయం మించిపోలేదు. మొక్కకు గొప్పు తవ్వాలి. నీరు పెట్టాలి. మొగ్గ చక్కగా విరుస్తుంది. 'ఏం తప్పలేదు.' అను కున్నాడు.మంగ వికసించిన పూవులా పరిమళించాలనుకున్నాడు. ఆ పరిమళాన్ని తానాఘ్రాణించా లనుకున్నాడు. లేదు. తప్పు లేదిందులో. ఆమెకు పెళ్ళయింది గాని. పురుషస్పర్శే ఎరుగదు. తనకా భార్య పోయింది. ఎవరికీ జరిగే అన్యాయమేమీ లేదు. లోకులా? తన ఎదురుగా ఎవరూ నిలిచి మాట్లాడలేరు. అందు కని మంగని అన్నివిధాలా ఆదుకోవాలను కున్నాడు.

అందుకు నాంది గతంలో ఇలా జరిగింది.

తన బాధ చెప్పుకుని ఏకాంతంగా గదిలో వెక్కివెక్కి ఏడ్చింది మంగ. ఆమె అక్క కొడుకు పొలం వెళ్ళాడు. ఊరి చివరి పాక. అందునా ఆయన తనకి న్యాయమని తోచిన ఏ పని చేయడానికీ భయపడరు. ప్రపంచ న్యాయంతో ఆయనకి పనిలేదు తనకి న్యాయమని తోచినది చేసి తీరుతాడు.

సమయం వచ్చింది. ఏడుస్తున్న మంగని మంచం మీద కూర్చున్న ఆయన ఒంగి అమాంతం దగ్గరికి లాక్కున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్నదల్లా. ఉలిక్కిపడింది. ఉక్కిరిబిక్కిరి అయింది ఆయన చేతుల్లో. వెరుగుపడి ఆయన ముఖంలోకి చూసింది

తప్పించుకో లేని బిగికౌగిలి. తీయని ముద్దు. ఎప్పుడూ ఎరుగని పురుషస్పర్శ. కంగారు పడిపోయింది మంగ. కొప్పు వూడిపోయింది. నిడుపాటి వెంట్రుకలు వీపువెల్లా కప్పాయి. "తొందర పడుతున్నరేమో బాబయ్యా! తప్పేమో." అంది తడబడుతూ

"తొందర పడుతున్నది నిజమే మంగా! కానీ తప్పు చెయ్యడం లేదు. నీకు పెళ్ళయింది గాని. నీ మొగుణ్ణి నువ్వెరు


# భర్త రైట్

నిన్నటి రామాయణంలో
సీత
ఒక్క రాముణ్నే ఆకట్టుకుంది–
నిన్నటి భారతంలో
ద్రౌపది



అయిదుగుర్ని కట్టుకుంది–
భర్తలెందరైతే నేం?
అంతా అడవుల కిడ్చేవాళ్ళే!

—టి. వేణుగోపాల్





గవు. “నే నీ మొగుణ్ని అనుకో” అన్నారు. చెంపలమీద జుట్టు పైకి తోస్తూ- చెక్కిలి ముద్దాడుతూ. చెవిలో గుసగుసగా.

ఒళ్ళు తెలియడం లేదు మంగకి. వేలాడిపోతోంది. శరీరమంతా ముచ్చెమటలు పోస్తున్నాయి.

“పరువు సంగతి ఆలోచించిరా?”

“నా పరువేం పోదు. నేను మొగాణ్ని. నీ పరువు పోవ డం. నీ తెలివి మీద ఆధారపడి ఉంది. నీకూ నాకూ మధ్య దావా ఉండనే ఉంది. నిన్ను దావా గెలిపించి తీరుతాను. పిల్లపాపా కలగకుండా జాగ్రత్తలు నాకు తెలుసు– అని నవ్వారు.

ఆ తరువాత · “నీ దత్త పుత్రుణ్ని మాత్రం కాసుకో మన జోలికి రాకుండా” అన్నాడు.

మైమరచిపోతున్న మంగ ఏమంటుంది? సరే అన్నట్లు. ఎలాగూ మైల పడిపోయానన్నట్లు ఆయన్ని హత్తుకుపోయింది. రెండుచేతులతో ఆయన్ని పెనవేసుకుపోయింది. ఆయనగుండెల మీద తలవాల్చింది అంతా నీదే భారం అన్నట్లు.

అలా శృంగార జీవితంలోకి అడుగు పెట్టింది మంగ.

ఆ తరువాత నెమ్మది నెమ్మదిగా పూర్తిగా మారి పోయింది.

ఆమెకి కిష్టయ్యగారు శృంగారం నేర్పారు. సరసం నేర్పారు, చిలిపితనం నేర్పారు.

అన్నీ నేర్చిన మంగ ఆయన అండదండల్లో హాయిగా కాలక్షేపం చేస్తోంది.

కిష్టయ్యగార్ని. మనసులో భర్త అను కుంటుంది. ఆయన కుటుంబం తనకుటుంబమే అనుకుంటుంది.

ఆయనపిల్లలు తన పిల్లలే అనుకుంటుంది. కిష్టయ్యగారు పీపరుగు మీద వాలుకుర్చీలో పడుకున్నప్పుడు,

ప్రక్కనున్న కచేరీ గది

గుమ్మంలో కూర్చుని ఆయనకి మాత్రమే వినిపించేలా కబుర్లు చెబుతుంది. ఆయనకి మాత్రమే కనిపించేలా, వీధివారికి కనిపించకుండానూ కూర్చుంటుంది.

ఇంట్లో వాళ్ళకి తెలిసినా ఆ దరిదాపులకు రావడానికి వారికి ధైర్యం చాలదు.

పైకి మంగమ్మ దావా గొడవలు అవీ అనుకుంటారు. లోపల మనసు ఏమేమి గొణుగుతుందో వారికే స్పష్టంగాతెలిసి చావదు.

కాంతమ్మగారు సూక్ష్మగ్రాహి.

అన్నీ చూదాయగాఆమెకు తెలిసిపోతూ వుంటాయి. కానీ ఆమె తెలివైనది అన్నీ తేలిగ్గా తీసుకుని. చిరునవ్వుతోనే అందర్నీ అదుపులో పెట్టాలనుకుంటుంది.




## 5

మిరపపళ్ళు కోసి కూలీలు రాసులు పోస్తున్నారు. కిష్టయ్యగారు నాలుగువేపులా తిరిగి అజమాయిషీ చేస్తున్నారు. మధ్య మధ్య చేనుగట్టువార వున్న మామిడి చెట్టునీడలో నించుంటున్నారు.

చెమటపట్టిన ముఖాన్ని తుడుచుకుంటూ ప్రొద్దుకేసి చూశారు సూర్యుడు నడినెత్తి కొచ్చాడు.కడుపులో ఆకటకరకర లాడుతోంది. చేయవలసిన పనిని పాలేర్ల కప్పజెప్పి ఇంటి ముఖం పట్టారు.

చేతి కర్ర చేతితో వూపుకుంటూ, వోచేత్తో పంచెకొంగు పైకి పట్టుకుని ఠీవిగా నడుస్తుంటే,మిరపచేలు సహితం తలలు వంచి ఆయనకి నమస్కరిస్తున్నట్లు వూగుతున్నాయి.మనసులో ఏవేవో మధురోహాలు. మందహాసం చేస్తూ, మీసం మెలేస్తూ గుండెల నిండుగా గాలిపీలుస్తూ, గుమ్మం దగ్గర కొచ్చి క్షణం ఆగి నాలుగువైపులా చూశారు.

మెట్లెక్కి చెప్పులు విడిచి అరుగుమీద ఈజీ ఛైర్‌లో వాలి కళ్ళు మూశారు 'మంచినీళ్ళు కావాలని' ఇంట్లోకి అరచారు ఎవరే మూలవున్నారో, వినిపించుకోలేదు.

కళ్ళు తెరిచి చూస్తే కంటి కెదురుగా రమణీయమైన దృశ్యం. తిరుపతమ్మ పెద్ద నూతిదగ్గర (ఆ ఊరి కదొక్కటే నుయ్యి) స్నానం చేస్తోంది.

నిలువునా నీళ్ళోడుతూ చూడముచ్చటగా వుంది. పచ్చని ఆమె శరీరానికి తడిసిన చీర అంటుకుపోయింది. పనసతొనల్లా శరీరానికి ఎక్కడికక్కడ ఒంపులు. చేతినిండా గాజులు ముఖంనిండా పసుపు. కాళ్ళకి నిండుగా అందెలు కడియాలు. గొలుసులు.

కిష్టయ్యగారు రెప్పవేయకుండా చూస్తున్నారు. ఛీ! ఈమె పరస్త్రీ. ఇలా చూడకూడదేమో.

పరస్త్రీయేగాని. ఏం చేస్తుంది పాపం? ఆవిడ పురుషుడు ఎప్పుడూ పూజల్లోనూ, జపతపాల్లోనూ మునిగి తేలుతూ వుంటాడు. అంతగా విరగబడుతున్న పరువాన్ని ఏం చేస్తుంది పాపం? అయినా ఎప్పుడోగాని పరమాన్నం వండుకోడానికి వీలుకాదు.

పరమాన్నమంటే తిరుపతమ్మ. కిష్టయ్యగారలకొక సంకేత పదం.

"ఏంటి తిరుపతమ్మా! ఇప్పుడు స్నానం చేస్తున్నవ్? ఇంకా వంట కాలేదా?"

"వంటా. నా శ్రాద్ధమా, ఆ మాష్టి సంతానం లేదూ? అదే మా ఆడపడుచు పిల్లలు ముట్టుకున్నారు. నా మడి మైలపడి చచ్చింది. ఇంకేముంది. ఇలా పొద్దుల్లాస్నానాలతో చస్తున్నాను"

"స్నానాలు చేస్తే మైలపోతుందా తిరుపతమ్మ" అన్నారు ముసిముసిగా నవ్వుతూ.

"ఎందుకు పోదూ?" అంది బకెట్టుతో నీళ్ళు తోడినెత్తి మీద పోసుకుంటూ.

"నీ కోపం. తాపం చల్లారుతాయేమోగాని మైలపోదు."

"కోపం. తాపం నీళ్ళతో చల్లారవు కిష్టయ్యా!" అంది ముఖానికి మరో పసుపుముద్ద పట్టించి.

"మరి దేనితో చల్లారుతాయంటావ్?"

ఈసారి చురచుర చూసింది

"నీకు వేళాపాళా లేదేంటి, వేళాకోళానికి, ఆకలెయ్యడం లేదూ? ఇంట్లోకి పోయి కోడలు పెట్టింది, తిని పోకునుకు తియ్యి. తరువాత మాట్లాడుకుందాం. తక్కిన సంగతులు" అంది బిందెలో నీళ్ళు తోడి నింపుతూ.

"కోడలు చిన్నపిల్ల. దానికి నాఆకలేం తెలుస్తోంది తిరుపతమ్మ? నీలాంటి వాళ్ళు పరమాన్నం వండి నా ఆకలి తీర్చాలిగాని"

తిరుపతమ్మ వళ్ళు పిండుకుంటూ చీర పిండింది. బిందె చంకనేసుకుంది. "నీ పరమాన్నం పాడుగాను. టైమ్ రానియ్యి వయ్యా వండి పెడతాను" అని లోపలికి చక్కాపోయింది.

తిరుపతమ్మకి పాపం తాపం. ఒకటికి నాలుగుసార్లు మైలపడ్డానంటూ స్నానాలు చేస్తుంది తనకా దృశ్యం కనువిందు చేస్తూ వుంటుంది. తనకి కనువిందు చేయడానిక్కాదు కదా అలా పదే పదే స్నానం చేయడం? లేక విరహతాపం చల్లారడానికా?

నిట్టూర్చి కుర్చీలోంచి లేచి కచేరి గదిలోంచి లోపల హాల్లోకి వచ్చాడు.

లలిత పడమటిల్లు వూడుస్తుంది. బాల పీటలు వాలుస్తోంది. "మడివంచె ఆరింది మామగారూ! స్నానం చేసి భోజనానికి రండి" అంది కోడలు.

స్నానం చేసి మడివంచె కట్టుకుని భోజనానికి కూర్చున్నారు కిష్టయ్యగారు. భోజనం టైమ్‌లో మడివి పాటిస్తారు.

పప్పు, గుమ్మడికాయ పులుసు, వంకాయ కూర, మంచి నెయ్యి. వడియాలు.

కడుపునిండుగా భోజనం చేస్తూ కొడుకును గురించి అడిగారు. "పెద్దాదేడమ్మా! ఓ సారి పొలంలోకి వెళ్ళొస్తే బాగుండును."

"భోజనం చేసి ఎక్కడికో వెళ్ళారండీ." అంది కూర మారు వడ్డిస్తూ.

"ఆఁ ఎక్కడికి వెళతాడు? ఏం పనుంది? వాడికి ఆ పేకాటే కదా, రాజమండ్రిలో చదువుకు చేరిస్తే ఆ చదువూ అంతమాత్రం వెలగబెట్టాడు. పోనీ పొలం పనులైనా చూసుకుని ఏడుస్తాడా? అంటే అదీలేదు. నాకు సత్తువ వున్నంతకాలం పరవాలేదు. ఆ తరవాత?"

దానికి జవాబేం చెప్పలేదు శాంతమ్మ.

భోజనం మజ్జిగ దగ్గరకి వచ్చింది.

పెరుగుబదులు మజ్జిగ వడ్డించింది.

కస్సుమని లేచారు కిష్టయ్యగారు.

"సాహేబుకు నవాబురాజ్యం వచ్చినా బూబమ్మకు కుట్టుపోగులు తప్పవని" గేదెలన్నీ పాలిస్తుంటే నాకు మజ్జిగ పోసావేంటి?"

గతుక్కుమంది శాంతమ్మ భయంతో ఒణికింది.


ఎలాగో నమ్మళించుకుని చిరునవ్వు తెచ్చుకుని సమాధానం చెప్పింది.

"ఆయన ప్రొద్దుట ఇంట్లోనే పేకాట ఆడారండీ. పాలన్నీ పేకాటవారి కాఫీలకే సరిపోయాయి. రాత్రికి పెరుగు చాలదని మజ్జిగచేసా"

"అవునవును నువ్వు కాఫీలు పోస్తుంటే ఇంట్లో పేకాట పెట్టడూ? నువ్వుకొంత పాడుచేస్తున్నావు వాణ్ని."

## శ్రీ చక్రం

చక్కెర పానకంలో
మునిగి తేలే
గులాబ్ జామ్
కసా - పిసా
కలిసి
అహం అనుభూతిలో
లయించిన
జిహ్వ పరాకాష్ట
సెక్స్‌తో, సమాధితో
త్రికోణసంధి-
శ్రీచక్రం.



—ఆర్. ఎస్

మామగారి ఆ అభియోగానికేమీ జవాబు చెప్పలేక నిట్టూర్పు విడిచింది శాంతమ్మ.

భోజనం ముగించుకొని, మడిపంచె మార్చుకుని కచేరీ గదిలో కొచ్చారు. తరువాత వీధిలోకొచ్చి చుట్టకాల్చారు. ఈజీ చైర్‌లోనే. ఈ లోగా లలిత వచ్చి ప్రక్కసర్దింది. మంచి నీళ్ళ చెంబూ గ్లాసు మంచం క్రింద పెట్టింది.

తాపీగా లోపలికొచ్చి తలుపులు బిగించి మంచం మీద మేను వాల్చారు కిష్టయ్యగారు.

కిష్టయ్యగారు మూడు నాలుగు గంటల వరకు కునుకు తీస్తారు. నిద్రలేచాక ఫలహారం చేస్తారు.

సాధారణంగా శాంతమ్మ చేసే టిఫెన్లు ఆయనకి నచ్చవు. శాంతమ్మ పట్నవాసం నుంచివచ్చిన పిల్ల. సుతారంగా ప్లేట్లో ఉప్మాగాని, దోసెగానీ. పకోడీగాని చేసి పంపిస్తుంది. పప్పులు రుబ్బలేదు. తనకవి ఆపోవు. మినపరొట్టో. గారెలో అరిసెలో. కజ్జికాయలో కావాలి. అవి తన ఇంట్లో అమరక పోయినా ఫరవాలేదు. బైట అమిరిపోతూ ఉంటాయి.

తమ ఇంటికి ఓ ప్రక్క ఇంట్లో పార్వతి ఉంది. మరదలు. తమ్ముని భార్య! విశేషించి మేనమామ కూతురు తన అభిరుచులు ఆమెకు బాగా తెలుసు. పార్వతిని తనకే ఇవ్వా లనుకున్నారు. ఏళ్ళు చాలా వార్న పున్నమూలంగా తమ్ముడికి ఇచ్చారు. ఆ దురదృష్టవంతుడు చిన్నతనంలోనే కాలం చేసాడు. ముగ్గురు పిల్లలు పార్వతికి. ఇద్దరు ఆడపిల్లలు ఒక మగపిల్లవాడు. వాళ్ళ సంసారం ఆస్తిపాస్తులూ తానే చూస్తున్నాడు.

పార్వతి తమ్ముడి భార్య అని తను దూరంగా ఉంచు తాడు కాని. పార్వతికి ఆ ఇబ్బంది లేదు.

ఎంత వారించినా ముందుకు తోసుకు వస్తుంది. అసలు తననే పెళ్ళాడవలసిందని, అస్తమానూ అంటూ ఉంటుంది అది తన మనసును గాయం చేస్తూ ఉంటుంది.

ఆ మధ్యాహ్నం పార్వతి కబురు పెట్టింది. మినప రొట్టి చేసానని.

నేరుగా పార్వతి ఇంటికి వెళ్ళాడు.

హాల్లో ఉయ్యాల బల్లమీద కూర్చున్నాడు. "పార్వతీ" అని పిలిచాడు.

వంటింట్లోంచి వచ్చింది పార్వతి. "బావా" అని ఆప్యాయంగా పిలుస్తూ.

ఆ బొట్టులేని ముఖం చూస్తే తమ్ముడు గుర్తుకొస్తాడు ఇక్కడ మాత్రం తన మనసుకు చాలా సంకటంగా ఉంటుంది.

కాని పార్వతి ఊరుకోదే, మీదమీదకు ఎగబడుతుంది.

"ఏంటి బావా! ఆలోచిస్తున్నావ్!" అంది నవ్వుతూ.

"అబ్బ! ఆ పెట్టేదేదో తొరగా పెట్టు. పొలం పోవాలి. కుర్రాడేడీ? స్కూలు కెళ్ళాడా?"

"అంత తొందరేంటి బావా? నువ్వులేకపోయినా, నీ పనులు నువ్వున్నట్లే చేస్తారు. పనిలో తిరకాసు రావడానికి గుండా. చెప్పవా? కుర్రాడు స్కూలుకు వెళ్ళాడు. పొరుగూరు

# ఓ రాత్రి కవిగాడి గది

ఎండా కాలంలోని
  వాగులా
నా గొంతు

మూలనెక్కడో పడిపోయింది
ప్లాస్టిక్ గ్లాసు

సిగరెట్లన్నీ కాలి కాలి
గది శ్మశానమైంది
ఓ సిగరెట్
కాల్తున్న శవంలా మండుతుంది
సిగరెట్ బూడిదగా మారే
శబ్దాన్ని వింటున్నా


మెత్త
కిందెక్కడో పడిపోయింది
నేనైతే
మంచం మీదే వున్నా

సగం గతికిన గీతాలు
నేటి ఆర్థిక వ్యవస్థలా
గాలికి రెపరెపలాడు తున్నాయి

ఆలోచనలన్నీ
'౦' డిగ్రీ దగ్గరి నీళ్ళలా

ఉదయాన్నే
నీ కిరణాలతో
గదంతా సర్దుకుంటుంది

గడ్డకట్టిన ఆలోచనలన్నీ
'ద్రాసయి'
గీతాలై ఎగిరి
మీ మనస్సుల్లో దాక్కుంటాయి.



—జింబో

నడవలేక చస్తున్నాడు. ఎందుకీ చదువు అమ్మా! అంటాడు. ఈ పల్లెటూరు వాళ్ళకి అదేం పాపమో. చదువు మీద మనసు పోకుండా ఉంది. ఊళ్ళో ఓ స్కూలు పెట్టించి ఊరుని, విద్య వైపు మళ్ళించావు కాదు. ఈ పెద్దాళ్ళని చూసి కుర్రాళ్ళు చెడిపోతున్నారు కదా "

"ఊఁ పోనీ. పెద్దాళ్ళు బుద్ధిగా ఉండరాదూ!" అన్నాడు నణుగుతున్నట్లు.

"బుద్ధి పుట్టుకతో వస్తుంది బావా, నా బుద్ధి చిన్నపుడే నీదయింది. మధ్యలో మీ తమ్ముడువచ్చాడు ఏ నాడు సుఖపెట్టాడు? ఏ నాడు సరసమాడాడు? తాగి వచ్చి ఎప్పుడూ తన్నులేగా."

"పార్వతీ!" అన్నాడు వారిస్తున్నట్టు బాధగా కణతలు నొక్కుకుంటూ.

"అవున్లే నీ తమ్ముణ్నంటే బాధే నీకు మరి. ఆ గొడవెందుగ్గాని. నీకు రొట్టెలోకి బెల్లం పాకం తెమ్మంటావా? ఉల్లిపాయ పచ్చడి తెమ్మంటావా?"

"రెండూతే"

పార్వతి నవ్విస్తుంది. కవ్విస్తుంది. ఆరాధిస్తుంది. ఎన్నయినా చేయనిస్తాడు కాని, తాను తమ్ముని సొత్తుమీద చెయ్యివేయలేడు. చెడుగా ఆలోచనైనా రానీయలేదు. పార్వతి అభిమానాన్ని ఆరాధనని స్వీకరించగలడు గాని, శరీరాన్ని స్వీకరించలేడు. ఆమె స్వయానా తమ్ముని భార్య కావడమే అందుకు కారణం. తన శృంగారమంతా పార్వతి దగ్గర నీరు కారిపోవలసిందే. ప్రేమ. సానుభూతి. జాలి, ఇవి తప్ప ఇంకో భావన పార్వతి పట్ల తన మనసులో నిలవదు.

పార్వతి మాత్రం తనని మనసారా ప్రేమిస్తోంది కాంక్షిస్తోందనీ తెలుసు. ఆ కాంక్షని తానుసున్నితంగా తిరస్కరించేస్తాడు. తమ్ముని సొత్తు తాను తాకలేడు ఉవ్వెత్తున సముద్ర తరంగమల్లె వేచి పడుతున్న పార్వతిని. చాలా ఓర్మితో చల్లబరుస్తూ ఉంటాడు.

అతన్ని మనసులో ఆరాధిస్తూ ఎక్కడికక్కడే అని సంతృప్తి పడుతుంది పార్వతి.

తన గుండెల్లో ప్రేమ అనురాగం అనేవి ఏవైనా ఉంటే అవి పార్వతివే అనుకుంటాడు ఆప్యాయంగా చూస్తాడు ఎంతో ఇబ్బంది ఫీలవుతాడు. అతని ఇబ్బందికి పార్వతి నిట్టూరుస్తుంది.

రొట్టె పాకంలో ముంచి తింటున్నాడు.

"రొట్టె బాగుందా బావా!"

"బెల్లం పాకంలో ముంచితే ఎందుకు బాగోదు."

"ఉల్లిపాయ కారంలో కూడా నంచుకో."

"వద్దులే."

"రెండూ కావాలన్నావ్ మరి."

"తీపి చాలులే."

"ఏంటో బావా! నీదంతా చిత్రంగా ఉంటుంది. నాదనుకున్నదంతా నీ కిస్తానంటే తప్పా?"

"పార్వతీ!" అన్నాడు బాధగా క్షణం కళ్ళు మూసుకున్నాడు.

"నొక్కరాని చోట నొక్కి నా మనసెందుకు నొప్పిస్తావ్? నువ్వు నా మేన మరదలివి కావచ్చు. కాని తమ్ముని సొత్తువి."

"అతనిప్పుడు ఈ లోకంలో లేడుగా."

"ఉన్నా లేకపోయినా"— ఆపై మరింకేం మాట్లాడాలో తెలియక ఆగిపోయాడు.

"నా ఆశలు కోరికలు ఇలా అణగారి పోవలసిందేనా బావా? నీ వెందరి పరాయి సొత్తుల్ని నీవి చేసుకోవడం లేదూ!" సిగ్గుతో, బాధతో, తలవంచుకుని అంతకంటె స్పష్టంగా తన కోరిక ఎలా చెప్పాలో బోధపడక.

"ప్రియమైనవారంతా ప్రియులుకానక్కరలేదు పార్వతీ. మనసు సమ్మాళించుకో."

అని ఊయ్యాల మీంచి లేచాడు.

లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. పట్టరాని దుఃఖంతో పెదవి కొరుక్కుంటూ, అతను మంచినీళ్ళు త్రాగడం పూర్తిచేసేవరకు నిలబడి గ్లాసందుకుని, ఆమె వంటింట్లోకి వెళ్ళడం, అతను వీధిలోకి రావడం జరిగాయి.

కసి, దుఃఖంతో అతను వెళ్ళిపోయాక ఆ ఊయ్యాల బల్లమీద వాలిపోయింది.

కళ్ళమ్మట నీళ్ళు జలజలా రాలుతున్నాయి.

'ఛీ! మగవాడు అతను బైట బడాలిగాని, ఆడదై వుండీ తానిలా బైటపడ్డం ఏం బాగోలేదు. అదే అతనికి లోకువైపోయింది. అతని మనోతెరల పొరల్లో తమ్ముడు మరుగున పడలేదు. అందుకే మధన పడుతున్నాడు. మొదట్లో తనని పెళ్లాడడానికి సరదాపళ్లేదూ? తన తండ్రి వయసు తేడా అని అతనికియ్యలేదుగాని. లేకపోతే తనరాత ఇలా వుండేదా? ఏమయినా ఇక తాను తొందర పడకూడదు. ఎలా అయినా బావని లొంగదీసుకు తీరాలి. పిల్లలయితే ముగ్గురు పుట్టారుగాని. తాను ఏం సుఖపడి చచ్చింది? తన భర్త ఏనాడు ఇంట్లో పడుకొన్నాడు? ఏమయినా సరే బావ మనసు మార్చాలి. ఊయ్యాల మీద కూర్చుంటే సరా! ఊగాలి. సరదా తీరాలిగాని.



బావ తన మనసుని సమ్మోహించుకోమని తిడతాడు. తనేమరి? ఆ తిరుపతమ్మతో, ఆ మంగమ్మతో? తనేనా అంత పరాయిది?

పార్వతి ఊహల ఊయ్యాల లూగుతోంది.

ఊయ్యాల మాత్రం ఊగడంలేదు.

పొలం వైపు నడుస్తున్న కిష్టయ్య గుండెబరువెక్కింది. పార్వతితో గొప్ప చిక్కుగాఉంది. తను ఆమె అప్యాయతనీ, అనురాగాన్నీ, అందుకోగల్గుతున్నాడు. అభ్యర్థనను మన్నించ లేకపోతున్నాడు. అందుకు తన అంతరాత్మ ఎంత మాత్రం అంగీకరించడం లేదు. తనూ మడిగట్టుకులేదు, అయినా ఆమె వైపు మనసు పోనని మొరాయిస్తోంది. ఏం చెయ్యాలి?"

## 6

కాలచక్రం తిరుగుతూనే ఉంది. ప్రతీరోజూ ఉదయ రాగం. తిరుపతమ్మగానం అంతా మామూలే

పాలేర్లు వచ్చి, ఆవులకీ గేదలకీ మేతపెట్టి కసువుఊడ్చి, పాలుపితికి, పశువుల్ని విప్పేస్తారు

కావిళ్ళతో గోదావరి నీళ్ళు తెచ్చి. నూతి నీళ్ళతోడి, పోసి, పొలం పనులకు వెళ్ళిపోయారు.

రాజు ఆలస్యంగా నిద్రలేచారు.

శాంతమ్మ అతని అలకలు తీరుస్తూ కాఫీ అందించింది. లలితా, బాలాకూడా ఆలస్యంగానే నిద్రలేస్తారు. ఇంట్లో ఉన్న ముసలావిడ, శాంతమ్మ, ఇంటి పనులు చూసుకుంటారు.

ఆ రోజు రాజు కాలకృత్యాలు తీర్చుకొని, కిష్టయ్యగారు పొలం పనులకు వెళ్లేవరకు చూసి, చెప్పులు తొడుక్కుని, బైటకు పోవడానికి, నాలుగు అడుగులు వేసాడు.

శాంతమ్మ హడావిడిగా హాల్లోకి వచ్చింది.

"పేకాటకేగా"? అంది లేని నవ్వు తెచ్చుకుంటూ.

"రోజు అడగడంలో నీ ఉద్దేశ్యం?" ఇంచుకరోషంతో వెనక్కి తిరిగి చూస్తూ అన్నాడు.

నవ్వు రాకపోయినా ఫక్కున నవ్వింది.

"నా ఉద్దేశ్యం ఏమీలేదు. బైటకి వెళ్ళిపోతే. భోజనం మర్చిపోతారని. ఇంట్లో అయితే మరిచిపోరని".

"మానాన్నా పొలం నుంచి కూరానారా పట్టుకుని, మధ్యలో పానకంలో పుడకలా వస్తాడు. తనేదోగొప్పవాడైనట్లు నేనేదో చెడిపోతున్నట్లు. నాస్నేహితుల ముందే తీసిపారేస్తాడు. నా అంత వాణ్ని. నేను అందునా చెట్టంత భార్య ఉండాయె".

"ఏదో పెద్దవారు. మిమ్మల్ని సపోర్టు చెయ్యడానికి నేనున్నానుగా. ఆ బిచాణా ఇంట్లోనే పెట్టండి. వేళకి నిద్ర భోజనం లేకపోతే మీ ఆరోగ్యం చెడుతుంది".

శాంత అభ్యర్థన సబబుగానే తోచింది. శాంత తన కెపుడు ఎదురుచెప్పదు.'మీఅద్దేదో మీరుతీర్చుకోండి'అంటుంది. ఒకరు ధర్మం తాడు గట్టిగా పట్టుకుంటే, ఒకరు తప్పినా—ఆ తాడు పట్టుకుని నూతి లోంచాయినా పైకి రావచ్చు.మనవాళ్ళేం తెలివి తక్కువ వాళ్ళుకాదు. స్త్రీలకి మంచిధర్మాలు బోధించారు. అని మనసులో అనుకుంటూ పైకి నవ్వాడు.

## వెలుతురు చినుకులు



ఎత్తైన
కీర్తి శిఖరిమీద
గుత్తులు గుత్తులుగ
రేకులు విచ్చుకొని
సురభిళాలు విరజిమ్ముతున్న
శిరీషాల మాట-సరే!

దిగులంటి భవిష్యత్తు కోసం
కళ్ళలో ఆశలు నింపుకొని
జాలిగా ఎదురు చూసే
చిరుకోరకాల మాట
పెదవి కదపలేని 'కవితాత్మ' చెప్పేది-

కదిలే జనమున్నా
కదిలించే కౌశలమున్నా
ఇన్ని ప్రొద్దులూ
హద్దులు ఎరుగని చీకటిలో
వాకాబ్యులరీతో క్రీడించిన 'పాళీ'....
ఇప్పుడిప్పుడే
పురిటి పొత్తిళ్ళ నుంచి ఒత్తిగిల్లి
కనురెప్పలు విప్పుతోంది
అక్షరారణ్యాల్లో
అమని వేకువన
వెలుతురులో తడిసి
'వేగుచుక్క'లా పొడవడానికి....
............

—కలికిరి వి. అబ్దుల్ ఖాదర్

శాంతమ్మ నవ్వింది కాని ఆంతర్యం రాజుకు బోధపడని స్థితిలో ఉన్నాడు.

స్నేహితుల్ని ఇంటికే పిలుచుకువచ్చాడు. మధ్యహాల్లో మిత్రబృందం పేకాట ప్రారంభించారు.

"అబ్బ అవతలవసారాలో కూర్చోరాదు." అంది శాంత.

"అదిగో ఇంట్లో పెట్టేదాకా చంపుతావ్. ఆ తరువాత అక్కడా ఇక్కడా అంటావ్". అని విసుక్కుంటూ వసారాలోకి మారాడు మిత్రబృందంతో రాజు.

చుట్టలు, బీడీలు, సిగరెట్లు తగలడుతున్నాయి.

వెండి రూపాయలు ఘల్లుఘల్లుమని ఒకచోట నుంచి ఒకచోటకు గెంతుతున్నాయి.

ఇత్తడి పాలచెంబు నిండా కాఫీ కలిపి రెండు, మూడు సార్లు అందించింది కాంత.

హాల్లోంచి అన్నగారు తల్పుకోగానే లలితా, బాల రెండో వసారాలోకి వచ్చిపడ్డారు.

అక్కడ సాంబ నగల దుకాణం విప్పుతున్నాడు. అడుగు ఊడిపోయిన ఇత్తడి బిందెలో ఊక దట్టించి. పగిలిన కుండలో కుంపటి తయారు చేసి బొగ్గులు వేసి, గొట్టంతో ఊదుతూ, నిప్పు రాజేస్తున్నాడు.

మూసలో బంగారం కరుగుతుంటే ఇద్దరూ మోకాళ్ళ మీద కూర్చుని వింతగాచూస్తున్నారు ఆ రంగు రంగు మంటల్ని.

"సాంబయ్యా! నా బొమ్మకి, పుస్తెలు చేసి ఇయ్యవూ?" అంది లలిత అమాయకంగా.

"ఇంకా బొమ్మపుస్తెలేమిటమ్మా! పెద్ద దానవవుతున్నావ్ బంగారం పుస్తెలే చేసి ఇస్తాను. అవి ముడేసే మొగుణ్ణి చూసుకో."

"ఛో అన్నయ్యా!" అంది సిగ్గుతో మొగ్గలా ముడుచుకుంటూ.

"దీనికి చచ్చేంత సిగ్గు అన్నయ్యా! ఇది పెద్దయిందన్న మాటేగాని, దీని మనసింకా చిన్నపిల్ల మనసే" అంది చిరునవ్వుతో పెద్ద ఆరిందాలా బాల.

"లలితా! కాస్తదొడ్లోదొండకాయలు తెంపి ఇయ్యమ్మా" అంది కాంతమ్మ.

ఆ పిలుపుకి లలిత వెళ్ళిపోయింది.

సాంబ చామనఛాయతో చక్కగా వుంటాడు. వయసులో వున్నాడు, ఒబ్బిడిగా వుంటాడు, ఉంగరాలు తిరిగిన క్రాపు. ముఖం మీద పడుతూ చాలా అందం వుంటుంది.

లలిత అతన్ని అన్నయ్య అనిపిలుస్తుంది ఆప్యాయంగా. కాని బాలకి అతన్ని అన్నయ్యా అనిపిలవాలని వుండదు. బావా అని పిలవాలని వుంటుంది. లలిత లేనప్పుడు, అప్పుడప్పుడు అలానే పిలుస్తుంది.



"అదేంటమ్మా! లలిత అలాగా, నీవిలాగా పిలుస్తావ్" అంటాడు సాంబ.

"ఎవరి మనసు వారిది. ఎవరి పిలుపు వారిది. నిజంగా నీవు మాకు అన్నవి కాదుగా ఫర్లేదులే" అంటుంది.

బాల తండ్రి పోలిక అంతా తన ఇష్టం వచ్చినట్లు జరగాలంటుంది. అలాగే చలాయిస్తుంది అందర్నీ. ఆ పిల్ల ఎవరికీ భయపడదు. ఊరంతా ఛెంగు ఛెంగున గెంతుతూతిరిగి వస్తూ వుంటుంది. ఊరి ఆడపిల్లలందర్నీ పోగేసి వీధరుగుమీద చింతపిక్కలు ఆడుతుంది.

సాంబ బంగారాన్ని చల్లార్చి సుత్తితో కొంత వరకు సాగగొట్టి ఆ తరువాత కమ్మెచ్చుల్లో వేసి సాగదీస్తాడు.

ఆరోజు బంగారం కరుగుతుంటే శ్రద్ధగా చూసింది బాల.

"సాంబూ! నేను బంగారం లాంటి దాన్ని కదూ?" అంది మత్తుగా.

"అవునమ్మా! బంగారువే"

"నా మనసు బంగారంలా కరిగిపోతుంది సాంబూ!"

"కరగనియ్యి"

"దాన్ని కమ్మెచ్చుల్లో వేసి సాగదీస్తావా?" అంది జాలిగా ముఖం పెట్టి.

"సాగదీస్తే ఏం? అందంగా, సన్నని బంగారు తీగలా వుంటుంది."

"తీగలా సాగి మెరుస్తుంది. కానీ చాలా నొప్పి, సాంబూ! ఆ కమ్మెచ్చుల్లో వేస్తే" అంది దిక్కుముఖం పెట్టి.

అదిరి పడ్డాడు సాంబ ఆ మాటకు అర్థాలు వెతుకుతూ. ఆమె కళ్ళల్లోకి చూశాడు.

ఎంతో అనురాగాన్ని, ఆకాంక్షనీ వ్యక్తం చేస్తున్నాయి ఆ కళ్ళు. పదహారు సంవత్సరాలైనా రాని బాల ఎలా మాట్లాడుతుంది? "నువ్విలా కబుర్లు చెబుతూంటే నా బుద్ధి చెడి పాడైపోతుంది బాలా! వెళ్ళు ఏ చింత పిక్కలో ఆడుకుందూ" అన్నాడు లేనికోపాన్నీ విసుగునూ కనబరుస్తూ.

"మంచి వాడవే, నేనిక్కడ లేకపోతే కబుర్లు చెప్పకపోతే నువ్వు పనే చేయలేవు తెలుసా? నేను సరదాగా కబుర్లు చెబుతుంటే నీ సొమ్మేంపోయింది చెప్పు? మీ నాన్నయితే ఇక్కడికి రానే రానియ్యడు. పోనీ నువ్వు మంచివాడవని వస్తే ఏంటా ఇది?" అంది అతని క్రాఫ్ మీద పడిన దుమ్ము దులుపుతూ.

సరిగ్గా అదే సమయంలో దొడ్డిగుమ్మంలోంచి మంగమ్మ ప్రవేశించింది. ఆ దృశ్యం చూసి కంగారు పడింది, ఆరాటపడిపోయింది." తన బిడ్డే దారి తప్పిపోతున్నంత గాభరాపడిపోయింది.

"బాలమ్మా! బంగారం కుంపటి దగ్గర నీ కేం పనమ్మా! ఇంట్లో పొయ్యి దగ్గర వంట నేర్చుకో. నీకు వంట నేర్చుకున్నట్లు ఉంటుంది. రేపు వచ్చేమొగుడికి బాగా వండి పెడుదువుగాని. మీ అయ్యకి చెబుతాగే, ముందు నీకు ముడె ట్టించమని."

"ఛీ ఫో! నువ్వేవస చెప్పడానికి? నా కప్పుడే పెళ్ళి వద్దు. మొగుడూ వద్దు. వంటేం నేర్చుకో అక్కరలేదు. అదే వస్తుంది. నాకూ మా నాన్న వంటమనిషినే పంపుతాడు మా అత్తారింటికి. మధ్య నీ సొమ్మేం పోమతే."

ఈ పిల్లకి ఎలా చెప్పాలప్పా? అని మంగమ్మ గడ్డం మీద చేయివేసుకొని తికమక పడింది.

"నీనేస్తం సోదెమ్మ లేదూ? దానికి పెళ్ళివారొస్తున్నారుట. వెళ్ళి చూసి రారాదూ?" "ఆఁ నిజంగా?" అని మరింక నిలవకుండా ఛెంగున గెంతి అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

ఆమధ్యాహ్నం కిష్టయ్యగారుభోజనంచేసి పడక్కుర్చీలో కూర్చుని, చుట్ట కాల్చుకుంటూ వుండగా వచ్చింది మంగమ్మ. గుమ్మంలో తలుపు చాటున కూర్చుని ఆరంభించింది.

"ఏకు ఏ పొలం, సాటు ఎవ్వారాలేగాని, ఇంటి గొడవలు పట్టవేంటి కిట్టయ్యగోరూ"

"ఏం! ఇపుడు ఇంట్లో గొడవలేం వచ్చాయి?" అన్నాడు చుట్ట పొగ గుప్పున వదులుతూ.

"ఈడొచ్చిన పిల్లలింట్లో ఉన్నారు. సంబంధాలు వెతకవేంటి? ఇన్నేళ్ళొచ్చి నీకే ఇన్నిరుచులు కావాలి గందా."

"తీరిక చిక్కి ఏడిస్తేగా? అయినా నా పిల్లలు అందాల బొమ్మలు. నాకేంలోటు? అల్లుళ్ళు కావాలన్న కట్నం ఇలా ఎడం చేత్తో పారేస్తాను." అని మీసం మెలేసారు

"చాల్లేవయ్యా! ఏ దర్జాలు నువ్వూను, ఆడపిల్లలుగలోడివి తిరక్కుండా ఎలా కుదురుతాయి సంబంధాలు. ఆవక ఏ బుద్ధి

## ప్రేమలీల

పక్షి ఒకటి పోతోంది ఒంటరిగా
అరుస్తూ కన్నీరు కారుస్తూ
దాని అరుపులో
విరహార్తి వినిపిస్తోంది!
ప్రేమకుగల అనేక అర్థాలు మనకు తెలియవు
పక్షి ఏ అనుభూతులు
గాలిలో నింపుతుందో మనకు అంతుబట్టదు
సముద్రం మీద తెల్లగా వ్రేళ్ళాడే చంద్రుడు
తన వ్రేళ్ళతో గాలిని గాలించడం మానడు!
సముద్రం భూమిని ప్రేమతోనే
అంగుళం అంగుళం తనలో లీనం చేసుకుంటుంది!
అనుక్షణం గత కాలంలో కరిగిపోతుంది!
ప్రపంచం ప్రతి అణువు
పరిణామాన్ని ప్రేమ మయంగా సంధిస్తుంది
మరి మనిషి?

—దివవహి వైజయంతి


మా ఖాతాదారులకు దీపావళి శుభాకాంక్షలు!

అతి తక్కువ కాలంలోనే మీ అందరి
ఆదరాభిమానాలు చూరగొన్న



సుమంగళి
పట్టు చీరల షోరూమ్
సీతమ్మసందు, రాజమండ్రి.
ఫోన్ : 4328

హోల్‌సేల్ రేట్లకే రిటైల్‌గా బట్టలు అమ్మే ఒకే ఒక్క షాపు

లాగే వాళ్ళనీ అట్టెట్టయ్యాయంటె. ఏం చేస్తావ్?"

"మంగమ్మ" అరిచినట్లే పిలిచారు. హడిలిపోయి నోరు మూసేసింది మంగమ్మ.

కిష్టయ్యగారికి కోపాన్ని సమ్మాళించుకోడానికి కొంత టైం పట్టింది.

"నా పిల్లలు రత్నాలే. వాళ్ళని నీ బుద్ధితో ఆలోచించకు. నా మగపిల్లలేమోగాని, ఆడపిల్లలకి తల్లిగుణాలు రావలసిందే, అందునా శాంతమ్మ చాటున పెరుగుతున్నవాళ్ళు. బుద్ధిమంతులు కావలసిందే".

"ఏమో కాని నీ రెండవ పిల్ల నీలాంటిజోరు పిల్లే. కాస్త జాగ్రత్తగా చూసుకో. నీమేలు గూర్చి చెప్పానుగాని నాదేంటి పోయింది? నా దావా సంగతి మర్చిపోక" అని చెంగు దులుపుకుని చక్కాపోయింది.

కిష్టయ్యగారు కాలుస్తున్న చుట్ట అవతల పారేసారు. ఠుప్పుకున ఉమ్మేసారు. 'దీని తస్సాదియ్యా! దీనిలా అనుకుంటోంది నా పిల్లలు. ఇది దిక్కుదివాణం లేని మొగుడు చచ్చిన ముండకాను! నా పిల్లలకేం? దీన్ని అట్టె ఇంటికి రానియ్యకూడదు' అనుకుని వాలు కుర్చీ మీంచి లేచి ప్రక్కదులిపి సరిగా వేసుకుని మేనువాల్చాడు.

వాలారన్నమాటేగాని ఆయన మనసు మనసులో లేదు. మంగ అలా పేలిందేమిటి? ఏమన్నా చూసిందా? అట్టే అలాంటి అవకాశాల్లేవు. వాళ్ళు పులిపిల్లలు. ఎవరికి దమ్ముంది వాళ్ళవైపు తేరిపారి చూడ్డానికి? ఎన్ని విధాల మనసు సరిపుచ్చుకున్న మనసుకు శాంతి లేకపోయింది. సరిగా నిద్రపట్ట లేదాయనకు. చిరాగ్గా అటూ ఇటూ దొర్లుతూ. ఇక నిద్ర పట్టదని లేచి వీధరుగు మీదకు వచ్చేశాడు. కుర్చీలో వాలి చెయ్యి ముఖం మీద వేసుకుని కళ్ళుమూసుకున్నారు. 'దీని తస్సాగొయ్య, మంగ కెన్నివేల గుండెలు? తన పిల్లలమీదే శంకలా? మగవాళ్ళ సంగతి వేరు' అనుకున్నారు.

తల్లి లేని పిల్లలు. తల్లిలా అభిమానించవలసిందిపోయి. ఒక వేళ తల్లిలా అభిమానంలోనే చెప్పిందేమో. తల్లి పోబట్టి కదా ఆపిల్లలు బైటవాళ్ళనోట్లో పడ్డం? తనకిలాంటి తిప్పలునూ తనకి భార్య వుంటే ఇలా వరించే వాడా? ఏమో భార్య గుర్తుకు వచ్చి కంటనీరు తిరిగిందాయనకి. పిల్లల క్షేమంకోరి ఇంట్లో రణ రంగం సృష్టించలేకా తను రెండో పెళ్ళికి రాజీ పడలేదు. తన అవసరాలకేముంది? సమాజంలో పురుషుడికి తప్పేం వుంది. ఆ మాటకువస్తే ఆడవాళ్ళు మాత్రం ఎందరుతప్పు చేయడం లేదు?

ముఖం మీదనుంచి చెయ్యి తీసి కళ్ళు తెరిచారు. ఎదురుగా దొడ్డిగుమ్మంలో తిరుపతమ్మ చిరునవ్వుతో తనని తిలకిస్తోంది. లేతపసుపు పచ్చ వెంకట జరీచీర పల్చగా ఒంటిని హత్తుకుపోయింది. ఆకుపచ్చ రవిక. ముఖాన ఎర్రని కుంకం బొట్టు. తలలో చామంతి పూలు మనోహరంగా వుంది. పసుపులోనాని నాని అసలే పచ్చని ముఖం, లేత తమలపాకులా వుంది. కళ్ళు చికిలిస్తూ తననే చూస్తుంది. తను కళ్ళు విప్పగానే "ఏంటయ్యా కిష్టయ్యా! అంతగా ఆలోచిస్తున్నవ్?" అంది. తిరుపతమ్మ చూస్తుంటే తనకి చాలా సంతోషం అయింది, నోరూరింది. ఆకలి వేసింది

"ఆలోచనలకేం, తిరుపతమ్మ! ఆకలివేస్తుంది. ఏమైనా వుందా?"

"ఆఁ పరమాన్నం వండానురా" అంది.


ఆ మాటకి అతని మనసు ఎగిరిగెంతువేసింది. కుర్చీలో నిటారుగా కూర్చున్నాడు తిరుపతమ్మ పరమాన్నం వండానంటె పెదవులు అందిస్తుంది. గారెలు కూడా వండానంటే గది తలుపులు బిగిస్తుంది" పరమాన్నం వండానంటున్నావు విశేషమేమిటి?" అన్నాడు వివరాలు తెలుసుకోవాలని.

"విశేషానికేముంది? ఈ మనిషి రాజమండ్రిలో పెళ్ళి చేయించడానికి వెళ్ళాడు. ఎవరో పెద్దింటి వాళ్ళేనట. తేరగా తినొచ్చని, ఆ దిక్కుమాలిన వెధవల్ని కూడా పట్టుకు పోయాడు. తమ్ముణ్ని పొలంపనులకు పంపాను. పాలన్నీ ఏం చేసుకోను? పరమాన్నం వండుకోక?"

"మరి గారెలు చేసావా?"

"అన్నీ ఉన్నాయి రావయ్యా!" అని లోపలికి. వెళ్ళిపోయి దొడ్డి తలుపు జార్లవేసింది.

పాపం తిరుపతమ్మకు పిల్లల్లేరు పసిమిచాయలో,లావుగా ఎత్తుగా ఉంటుంది. ఆస్తి ఉందని, పిట్టలాంటి సన్యాసిరావుకిచ్చి పెళ్ళి చేసారు. సన్యాసిరావు నిజంగా సన్యాసిలాంటి వాడే. నిత్యం జపతపాలు, పూజల్లో మునిగి తేలుతూ ఉంటాడు ఉన్నది చాలక పౌరోహిత్యం నెరుపుతాడు. భార్యను కలవడానికి అతనికెపుడూ తిథి, వార, నక్షత్రాలు కలసిరావు పగల్లా పూజలో, మడిలో, జపతపాల్లో ఎలా చచ్చినా తిరపతమ్మ కభ్యంతరం లేదు. వందసార్లు స్నానం చేసి, మడి కట్టుకుని వంద రకాల వంటలు వండి తగలబెట్టమన్నా తగలబెడుతుంది. ఎటొచ్చీ రాత్రులు కూడా నియమ నిష్టలు, ఆదివారాలు పాటిస్తే మాత్రం తట్టుకోలేస్తుందా విడకి. పైగా పిల్లల్లేరని. చెల్లెలి సంతానాన్ని తెచ్చుకుని పెట్టుకున్నాడు. పోటీగా తన తమ్ముణ్ని రప్పించింది. పిల్లల్లేరని మనసులో బాధ, తాపం చల్లారక తనువు బాధ. ఈ బాధలవల్ల అన్నీ ఉన్నా తిరుపతమ్మకి అశాంతి.





రోజల్లా ఒకటికి పదిసార్లు పిల్లలందర్నీ తిడుతుంది. ఒకటికి పదిసార్లు స్నానం చేస్తుంది. ఇటువంటి చిత్తక్షోభ పరిస్థితుల్లోనే సింహం లాంటి కిష్టయ్యతో స్నేహం చేసింది. స్నేహాన్ని ప్రణయంలోకి దింపింది. పరమాన్నంతో పాటు తన పరువాన్నందిస్తుంది.

కిష్టయ్య తనకి తగ్గ జోడీ. తన తాపాన్ని చల్లార్చాడు. తన జన్మ ధన్యత చెందింది అనుకుంటుంది. సన్యాసిరావుకి చస్తే భయపడదు.

కానీ ఆ కిష్టయ్యే అయినా పరమాన్నం అస్తమానూ వండుకు తినడానికి సీలుపడదు. అతనితో అనుబంధం పండగ లాగ, పరమాన్నం లాగ, అపురూపంగా వస్తుంది. దాన్ని అంత అపురూపంగానూ చూసుకుంటుంది.

కిష్టయ్య అటూ ఇటూ చూశాడు. మధ్యాహ్న సమయం. వీధి నిర్మానుష్యంగా వుంది. కచేరీగది తలుపులు దగ్గరగా వేసాడు. వీధరుగు మెట్లు దిగాడు.

తిరుపతమ్మ దొడ్లో చామంతి, మందార విరగబూశాయి. గాలికి తలలూపుతూ తీయగా పిలుస్తున్నాయి. చికాగ్గా వున్న మనసు చల్లబడింది.

తిరుపతమ్మ దొడ్లోనే కాదు. అందరి దొడ్లలోనూ మల్లి మందార, చామంతులకు కొదువలేదు. పనస, మామిడి, కొబ్బరి, అరటి, నిమ్మ, దానిమ్మ వంటి మొక్కలు ప్రతి ఇంటిలోనూ వున్నాయి. పువ్వులు, ఫలాలు వారికి వీరికి పంచి మరీ తింటారు. ఎవరు ఎక్కువ పంచితే వారి కంత గొప్ప.

దొడ్డి తలుపు గడియపడింది.

గదిలో చేరి ఎత్తయిన పందిరి మంచం ఎక్కకుండానే కిటికీ తలుపులు మూతలు పడ్డాయి.

కిష్టయ్యగారు ముసిముసిగా నవ్వుతూ "తిరుపతమ్మా! ఇంతటి వాణ్ని. నన్ను ఊపిరాడనియ్యవు కదా."

"అలా అడనిస్తే నా గొప్పేముంది? అయినా నీ ఊపిరిలో పాలపరిమళాలు, నీ కడుపులోకి పాయసాలు పోతే కొంపేం మునగదులే!"

అని మూతి విరుస్తూ లోపలికి వెళ్ళి వెండిగిన్నెలో పాయసం తెచ్చి స్టూలు మీద పెట్టి అలవోకగా అతని ఒళ్ళో చేతులాని నించుంది.

"ముందు పాయసం తినాలా? నన్నా?"

"తొందర్లేదు తినవోయి" అని మోచేత్తో పొడిచింది. మంచినీళ్ళు తేవడానికని మళ్ళీ లోపలికి వెళ్ళింది. తృప్తిగా పాయసం తిన్నాడు పెదవులు తుడుచుకోబోతుంటే చేయిపట్టి ఆపింది.

"ఆఁ మరిదా" అని ఆమెను ఒంగుని అమాంతం దగ్గరకు లాక్కుని ముఖాన్ని రెండు చేతులతో పైకెత్తి ఆమె పెదవుల్ని సత్కరించాడు.

అపుడే తిరపతమ్మకి తానే ఆ పరమాన్నం తిన్నతృప్తి కలుగుతుంది.

"నిషాగరిష్టుడి భార్యవి. నీకే ఎంగిలిమంగలాలేమిటి తిరపతమ్మా?" అన్నాడు నవ్వుతూ.

"ఆచారాలు, అంటు సొంట్లు ఆయనవి. అధరాలు నీవి."

అతని మెడని రెండు చేతులతో పెనవేసి విరగబడి నవ్వింది.

"ఆఁ ప్రమాదం అంతగా నవ్వకు." అని ఆమె నవ్వుని, విడివడ్డ పెదవుల్ని మూసేసాడు.

"క్రిష్ణా" అంది ప్రేమగా.

"గారెలు మర్చిపోయావోయ్" అన్నాడు.

"[illegible] మండిపోను" అని చెంగున మంచం దూకి పళ్ళెం నిండా గారెలు అల్లపచ్చడి వేసి తెచ్చి పెట్టింది.

"కానియ్యి. ముందు కడుపాకలి చల్లార్చుకో."

"ఆకలి. ఆరోగ్యవంతుల లక్షణం తిరుపతమ్మా" అన్నాడు గారెలు తింటూ. "చాలా బాగా చేసావే, అన్నాడు ఆమె నోటికో ముక్క అందిస్తూ."

"నా ఆకలి వేరులే" అంది నిట్టూరుస్తూ.

"నా ఆకలి నువ్వు తీర్చినప్పుడు నీ ఆకలి నేతీరుస్తాగా" అన్నాడు.

"తీరుస్తావులే ఆకలి నిత్యం వేస్తుంది కదా! పరమాన్నం నిత్యం వీలుకాదు కదా?"

"పరమాన్నం నిత్యం వండుకుంటే దాని గొప్పేం వుంది తిరుపతమ్మ. పండగనాడే వండుకోవాలి. అప్పుడే దాని ప్రత్యేకత. గారెలు తినడం ముగించి మంచినీళ్ళు త్రాగారు కిష్టయ్యగారు. తిరుపతమ్మ గది తలుపులు గడియపెట్టేసింది.


## 7

రోజులు వారాలు నెలలు గడిచిపోయాయి.

రాజమండ్రినుంచి కిష్టయ్యగారికి ఉత్తరం వచ్చింది. స్నేహితుడు వ్రాసాడు.

కిష్టయ్యా!

మీ అబ్బాయి చదువుపట్ల అట్టే శ్రద్ధ చూపడం లేదు. సినిమాలు షైర్లు ఎక్కువయ్యాయి. స్నేహితులతో పేకాడు తున్నట్లు కూడా విన్నాను. మీ పల్లెటూర్లో అయితే పనీపంగూ లేక, ప్రొద్దుపోక పేకాట రాయుళ్ళయ్యారంటే ఒప్పుకున్నాను. మా పట్నంలో తెల్లారి లేస్తే యమబిజీగా వుంటారు. ఒకళ్ళ మీద ఒకళ్ళు చదువులకీ, ఉద్యోగాలకీ పోటీలు పడతారు. సీ






కొడుక్కోసం. నువ్వు చాలా ఆశలు పెట్టుకుని తాపత్రయ పడ్డావుగాని. అవేం లాభం లేదనిపిస్తుంది. నువ్వు ఏమనుకో నంటే, మనలో మన మాటగా వ్రాస్తున్నాను. ఈ మధ్య వో ప్లీడరుగారమ్మాయితో తిరుగుతున్నాడు. ఎర్రగా బుర్రగా వుంటుందిలే. ప్లీడరు డబ్బు బాగానే గడించాడు. మీ కాపు వాళ్ళే. ఆలశ్యం చెయ్యక పెళ్ళి చేసి ఇంట్లో పడెయ్యి. అల్లరయ్యాక ఆ పని చేస్తే బెడిసికొడుతుంది.

మీ పెద్దాడెలాగూ పొలం పనులు చూసుకోడు. వీడింకా కుర్రనాగన్న.హుషారిచ్చి పొలం పనుల్లో తరఫీదిచ్చి దారికి తెచ్చుకో. ఇక్కడింకా ఉన్నాడంటే దారితప్పుతాడు. అప్పుడు దారికితెచ్చుకోవడం కష్టం అవుతుంది.

నేనిలా వ్రాసానని కోపం తెచ్చుకోకు. స్నేహితుణ్ణి కాబట్టి చనువుంది కాబట్టి వ్రాస్తున్నాను బాగా ఆలోచించుకో.

ఎలా బాగుంటుందని తోస్తే అలా చెయ్యి.

ఉంటా నీ మిత్రుడు సుందరం.

ఉత్తరం చదివాక కిష్టయ్యగారికి నడుం విరిగినట్లు అయింది.

శేషు మీద తనెన్ని ఆశలు పెట్టుకున్నాడు! వీడైనా చదివి గొప్ప ఉద్యోగస్తుడవుతాడని కలలుగన్నాడు. తనెంత సమర్థుడయితే ఏం ప్రయోజనం? కొడుకులిలా అఘోరిస్తుంటే. వాళ్ళు పూర్తిగా చెడిపోకుండా జాగ్రత్తపడ్డం తప్ప తానికేమి చేయగలడు?

8

శేషు సెలవులకి ఇంటికి వచ్చాడు. అతనితో తన మనసులో ఉన్నదేమీ ప్రస్తావించలేదు. తోటమ్మట,దొడ్డమ్మట హుషారుగా తిరుగుతున్నాడు శేషు.

కిష్టయ్యగారి ఇంటి వెనకాల ఇల్లు తులశమ్మగారిది. వారికీ, వీరికీ మధ్య పెరటిగోడ అడ్డం ఉంది. ఇవతల వీరి పెరడు అవతల వారి పెరడు. వీరి పెరటి వైపు వంటిల్లు. వారి పెరటి వైపు గది గుమ్మము నందు వున్నాయి.

తులశమ్మగారు తెల్లవారు జామునే లేచారు. చల్లచిలుకు తున్నారు పాడుతూ.

"గోపాలకృష్ణయ్య గునగున రావయ్య!
పట్టించనదయాడి నను బ్రోవవేమయ్య
పాలు మీగడ వెన్న, పొర్లిపోతున్నాయి
ఉట్టెక్క వద్దన్నానా? వెన్నతి నొద్దన్నానా?"

తన బొంగురు గొంతు కీచుగా సాగదీస్తూ-నానా అవస్థపడి పాడుతోంది తులశమ్మగారు.

చల్లచింది కుండచుట్టూ పారుతోంది.

కవ్వం బరువుగా తిరుగుతోంది తులశమ్మగారి గుండెలు బాధతో మెలితిరుగుతున్నాయి. ఆవిడ మనసు మనుమడి కోసం మథనపడుతోంది.

చల్లమధిస్తే వెన్న పడుతుంది. కృష్ణుని తలిస్తే వెన్న తరినట్లే. తన వంశాన్ని ఉద్ధరించడా? తనకు వరాలియ్యడా?తన ప్రార్థనవిని తప్పక ఇస్తాడని ఆవిడ నమ్మకం. అందుకే చల్ల చిలికినపుడల్లా కృష్ణుణ్ని ఆ పాటతో పిలుస్తుంది.

గదిలో మంచి నిద్రలో ఉన్న లీలకి అత్తగారి గొంతుక అసహ్యాన్ని కలిగించింది. ఆ పాటా ప్రార్థనా జాలిగొలిపాయి కళ్ళు నులుముకుని చుట్టూ కలయజూసింది. ప్రక్కనే భర్త పడుకున్నాడు. జడనిండా కుట్టిన మల్లె మొగ్గలు. ప్రక్కిరిసి ఉన్న మూలంగా విరియకుండానే ఊపిరాడక, వాడిపోయాయి. లేచి జడముందుకు వేసుకుని చూస్తే కనిపించినదది.

ఈ మాలలాగే తన బ్రతుకూ, ఊపిరాడక, విరియకుండానే పసివాడి పోతుందా?

"ఇంకా లేవలేదుటే లీలా! గోదావరికి వెళ్ళాలా! ప్రదక్షిణాలు చెయ్యాలా?

లీల విట్టూరుస్తూ గదిలోంచి బైటపడింది.

పూలజడ విప్పనారంభించింది. అరగడుగునా దారపు కుట్లు జడ విప్పడం కష్టంగా ఉంది. దారాలు తెంపుతుంటే పూల గొంతులు తెగి క్రింద పడుతున్నాయి. ఈ పూలలాగే తన

# రిపిటేషన్

రిపిటేషన్ బావుండదు నాకు.
వచ్చిన కలలే మళ్ళీ మళ్ళీ రావటం
అదే సంఘటన
జీవితంలో నిజం కావటం
వెర్రిగానే తప్ప కొత్తగా అన్పించదు
పెద్దగా అనుభూతేం మిగల్దు.

ఒకానొక ఫలితాన్ని ఊహించి
నిర్ణాయకంగా-
ఒక ఉద్దేశం ప్రకారం బ్రతకటం కూడా నచ్చదు.
ఊహించిన రిజల్ట్ నిజమైనా,
కాకపోయినా;
మిగిలేది నిరాసక్తతేగాని
గొప్పగా సంతోషమేం కలగదు కనక.
అన్ ప్లాన్డ్‌గా
అప్పటికప్పుడు నిర్ణయాల్ని తీసికొని
విజయమో, వైఫల్యమో ప్రాప్తించి
ప్రమోదసాగరం ఒడిలోనో,
విషాదయోగం ఒడిలోనో మునుగుతాను.
అందులో ఉన్న థ్రిల్
అసహన యువకుడి ఉద్వేగ ఉన్మాదానికి
తెలుసు.
ఐతే, మస్తిష్కంలో రిపీట్ అవుతూన్న
బాధ్యతల బరువు నెత్తిన పడిన వాడి
జ్ఞాపకాల చక్రానికి మటుకు ఇక్కడ
మినహాయింపు ఉంది.

ఎందుకంటే-
వయసుతోపాటు పాత అనుభవాల జ్ఞానానికి
కొత్త అర్థాలు మొలుస్తాయి కనకా
ఎప్పటి కప్పుడు వాడి మెమొరీస్‌కి
మీనింగ్స్ మారతాయి కనకా.

(ఇస్మాయిల్‌గారికి సమధికోత్సాహంతో)

—ఎస్.ఏ. రవూఫ్

బ్రతుకూ వాడిపోతుందేమో? వీటిలాగే తన బ్రతుకునీ, పిల్లలేరని గొంతుకోస్తారేమో?.

"ఇంకా తెమలలేదుటే. అద్దంలో అందాలు చూసుకుంటే

ఏం ప్రయోజనం? మన అందాలు పిల్లల్లో చూసుకోవాలి. పద,నడు జుట్టు ముడెయ్యి. బిందె,పసుపుకొమ్ములు, కుంకుమ పట్టుకో. దెయ్యంలా అలా నిలబడిపోతావేమే, నీకసలు పిల్లలు కావాలని సరదాలేదు. చట్టుబండలులేదు. మనసారా చేస్తేగాని పూజలు ఫలించవు.

ఓ ప్రక్క కోడల్ని సాధిస్తూంది. ఓ ప్రక్క తొందర చేస్తోంది.


లీలకి పెళ్ళయి అయిదారు సంవత్సరాలు దాటుతోంది. సంతానం లేదు. తులశమ్మగారికి భర్త లేదు. ఒక్కడే కొడుకు అన్ని రకాలుగానూ బలహీనుడు. సన్నగా తెల్లగా పొడుగ్గా రివటలా ఉంటాడు. తండ్రిపోయినపట్టి నుంచీ, అపురూపంగా పెంచుకొస్తోంది తులశమ్మగారు.

లీల చక్కని చుక్క. ఛామనఛాయ రంగులో చూడ ముచ్చటగా ఉంటుంది. సన్నగా, నాజుగ్గా, పొడుగు, పొట్టికాక మధ్యస్థంగా వుంటుంది. మిలమిల మెరిసేకళ్లు విడువాటి జుట్టు ఆమెకు పెట్టని సొమ్ములు.

ఆమె దృష్టిలో పిల్లలు కనేవయసు మించిపోలేదు. కాని తులశమ్మగారి దృష్టిలో మించిపోయింది. కొడుకులోగాని, కోడల్లోగాని లోపలున్నాయేమో అన్న ఊహ ఆమె మనసుకే రాదు. దైవలోపమని ఆమె నమ్మకం. అందుకని పూజలు ప్రదక్షిణాలు, జపతాపాలు,ఉపవాసాలతో కోడల్ని చంపుతోంది, మంత్రాలు తాయెత్తులు ఒకటేమిటి? అన్ని చేయిస్తోంది.

తన ఒక్కగానొక్క కొడుక్కి సంతానం లేకపోతే, వంశం నిలవదు సరికదా ఆస్థి వారసులకి పోతుంది తాము దిక్కులేని నిర్భాగ్యులవుతారు. అలా కారాదు. తనింట్లో మనుమలు పారాడాలి. ఉదయం లేచినది మొదలు, అందుకే ఆమె తాపత్రయం.

కోడలు, ఆమె గోదావరికి బయలుదేరారు. ఊరిప్రక్కనే గోదావరి ప్రవహిస్తోంది. గోదావరి గట్టునే ఆంజనేయస్వామి గుడి వుంది. రావిచెట్టు వేపచెట్టు కలిసిమెలిసి ఉన్నాయి. వాటికి కోడలుచేత పది బిందెల నీళ్ళు పోయించి. నూటొక్క ప్రదక్షిణాలు చేయిస్తుంది. ఆంజనేయస్వామికి పదికొబ్బరి కాయలు కొట్టిస్తుంది. అవి ఇంటికి తెచ్చి, కోరి, బెల్లం వేసి




# మాటలు చంపిన శవం కవిత

ఎప్పటి బాధే!
కవిత్వానికి మాటలు లేవు.
చెట్టు మంచి నేలరాలే
ఆకుల సుదీర్ఘమౌన పతనంలా
కవిత్వం వినపడదు.
కదుల్తూ కదలనట్టు కనపడే
చంద్రుడి అందంలా
అన్నీ నిర్జీవ వాక్యాలు.
అబద్ధమంత నిజంలా
నిరర్థక ఆకాశంలా
ఉపమానాల కొయ్యలకు తగిలించిన
మాసిన దుస్తులు కవితలు.
ఎగసిన అగ్నికణాలు బూడిదయినట్టు
అనుభవాలను వ్యక్తం చేసే పెనుగులాటలో
ఓడిపోయిన రక్తం గుర్తులు కవితలు.

—డా॥ ఎన్. గోపి

ఉండలు చుట్టి పదిమంది పిల్లలకు పంచుతుంది.

శేషు గోదావరికొచ్చి, స్నానం చేస్తున్నాడు.

తులశమ్మగారు లీల గట్టు దిగారు.

శేషు లీలని అంత దగ్గరగా ఎప్పుడూ చూళ్ళేదు.

'ఎంతందంగా ఉంది!' అనుకున్నాడు.

లీల స్నానం చేసి బిందెతో నీళ్ళు నింపుకుని రావి చెట్టుకు పోస్తూంది. ఆమె సన్నని నడుం బిందె బరువుకి అటూ ఇటూ ఊగుతుంటే శ్రద్ధగా గమనిస్తున్నాడు శేషు. ఆమె నీళ్ళోడుతున్న విడుపాటి కురులు, పిరులు దొర్లిస్తున్న కళ్ళు చూసీ చూడనట్లు చూస్తున్నాడు

వాళ్ళు పూజా కార్యక్రమం పూర్తిచేసేసరికి, తనూ తువ్వాలు కట్టుకుని లుంగీ పంచె పిండి, తిరిగి అది కట్టుకుని తువ్వాలు పిండి భుజాన్ని వేసుకుని సబ్బుపెట్టె చేత్తో పట్టుకుని వాళ్ళ వెనకాల పడ్డాడు.

శేషుని చూసి లీల సిగ్గుతో గబగబా ముందుకు సాగిపోయింది.

తులశమ్మగారు నడవలేక కాస్త వెనకపడ్డారు.

"పిన్నిగారూ, ఆ పూజలు దేనికి చేస్తున్నారండీ." అన్నాడు నవ్వును పెదాల మధ్య అణిచిపెట్టి.

"ఏముంది నాయనా, మనుమల కోసం చేయిస్తున్నానీ పూజలు. కేశవకి పిల్లలు పుట్టకపోతే మా వంశ వృక్షం ఎలా ఫలిస్తుంది చెప్పు?"

"ఫలాలియ్యని రావి చెట్టుకి ప్రదక్షిణాలు చేస్తేనూ, నీళ్ళు పోస్తేనూ ఫలాలెలా ఇస్తుందండీ! ఆ ఆంజనేయ స్వామి ఘోటక బ్రహ్మచారి. సంసారమూ, సంతానమూ, ఈగొడవేం పట్టని రామభక్తుడు. బ్రహ్మచారిని అతన్నెందుకు బాధపెడతారు చెప్పండి!"

"నీ మొహం మండా. ఏంటిరోయ్. శేషూ! తెగ వాగుతున్నావ్! పట్నం నీళ్ళు వంటబట్టాయా ఏంటి! అట్టా వాగావంటె పళ్ళు రాలతాయి జాగ్రత్త" అంది రుసరుసలాడుతూ. ఆ తరువాత గబగబా ముందుకు అడుగు వేసింది.

ముసిముసిగా నవ్వుతూ వెనకనుంచి లీలని చూస్తూ వెనకబడ్డారు శేషు.

## 9

సెలవులు సరదాగా గడిచిపోయాయి శేషుకి. కాని శేషు పరీక్ష తప్పాడు. తప్పినా మళ్ళీ వెళ్ళి కాలేజీలో జాయిన్ అవుతానన్నాడు. "అవసరం లేదు. ఇంట్లో ఉండే పరీక్షకు కట్టు. పేసవుతే అపుడే చూద్దాంలే" అన్నారు కిష్టయ్యగారు.

కాదూ కూడదు వెడతానని శేషు గొడవ చేసాడు. ఆ గొడవెందుకో కిష్టయ్యగారికి తెలుసు.

"నువ్వెందుకు వెడతానంటున్నావో— నాకు తెలుసురేరా అబ్బాయ్. పట్నం వెళ్ళి డబ్బు తగలేసి, సరదాలు తీర్చుకో నక్కరలేదు. నువ్వు కావాలనుకున్న అమ్మాయినే నీకు కట్టబెడతాను. పెళ్ళి అయాక చదువుకుంటావో, చాకలి పని చేసుకుంటావో, నీ ఇష్టం. నా కవసరం లేదు." అని విసురుగా వీధిలోకి వెళ్ళిపోయాడు.

హాల్లో చిన్న బుచ్చుకుని, నిశ్చేష్టుడై నిలచిన మరిదిని చూసి శాంతమ్మ నవ్వేసింది.

"అలా బిక్కచచ్చి పోతా వెందుకోయ్. కోరిన పిల్లని పెళ్ళాడబోతూ. కాస్త కులాసాగా ఉండు. చదువు కేంలే, ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడే చదువుకోవచ్చు. ఇంద ఈ కాఫీ త్రాగి స్నేహితులతో చెప్పిరా ఈ శుభవార్త." అని శాంతమ్మ అతన్ని ఓదార్చింది. ఈ వార్త చెల్లెళ్ళకు తెలిసిపోయింది.

"చిన్నవదిన వస్తుందోయ్. చిన్నవదిన" అని అన్నగార్ని ఆటలు పట్టించడం మొదలుపెట్టారు.

సరోజ అందంగా వుంటుంది. తన నేస్తం, ప్రియురాలు అవలీలగా లభ్యపడుతుంటె ఆశ్చర్యపోయాడు. తండ్రి చదువు మానెయ్యమన్నాడని చిరాకుపడ్డాడు గాని. సరోజను తెచ్చి ఇస్తున్నాడంటే సంబరపడ్డాడు.

తండ్రికీవిషయాలు ఎలా తెలిసాయబ్బా! ఇంకా ఈ ప్రేమ వ్యవహారంలో తండ్రితో చాలా తగువులు పడాల్సి వుంటుందనుకున్నాడు. ఆ అవసరం లేదింక. తన తరపునుంచి అభ్యంతరాలేమీలేవు. అవతలివైపు నుంచి కామేశం గారు ఒప్పుకోవాలి. తనపరీక్ష పోయింది. ఆయన ప్లీడరీ చేసి గడించిన దానికి రెట్టింపు ఆస్తి ఉంది తమకి. ఈ విషయంలో పర్లేదు మరి! సరోజ తనమీద ఏవ ఆశలు పెట్టుకుందో! తాను బ్రహ్మాండంగా చదివి పెద్దఉద్యోగి అవుతాడనుకుని ఆశలు పెంచుకుంటె. చదు




వులో తన అపజయం ఆమెకు నిరాశే కలిగిస్తోంది.

అయినా పెళ్ళయితే మాత్రం చదువుకోరాదని ఎక్కడ ఉంది! సరోజని ఈ విషయంలో ఎలాగోలాగ ఒప్పించవచ్చు! దీమాగా కాలరు సవరించుకుని హుషారుగా బైటికి వెళ్ళిపోయాడు

"ఒకసారి రాజమండ్రి వెళ్ళొస్తా! నాన్నా!" అని తండ్రిని అడిగాడు.

"వెళుదుగానిలే తరువాత" అని తండ్రి అడ్డు చెప్పాడు. ఈ వార్త సరోజకి ఎపుడు చెబుదామా అనిఉంది.

తండ్రి బాధ స్తమేమిటో తరువాత అంటున్నాడు.

కబురంది ఓ మంచిరోజు చూసుకుని కామేశంగారు ఊడిపడ్డారు.

## 10

పిండి వంటలతో విందు చేసారు.

ఊళ్ళో వుంటే ఎవరేమి గుసగుసలాడతారో అని ఆయన్ని పొలం తీసుకువెళ్ళారు కిష్టయ్యగారు.

పొలం గట్టుమీద మామిడి చెట్టు క్రింద కూర్చున్నాక పెళ్ళి విషయం కదిపారు.

"పిల్లలు ప్రేమించుకున్నరని విన్నాను."

"ఎలా విన్నారు ఈ ఊరిలో వుండి!" అన్నారు కామేశంగారు.

"నేనే ఊర్లో వున్నా పిలల విషయాలు తెలియకుండా వుండవు. చదవ మ్యాక. ఆడపిల్లల పెళ్ళిళ్ళు అయ్యాక చేద్దామనుకున్నాను. కానీ అబ్బాయి మీ పిల్లమీద మనసు పడుతున్నాడు. తల్లిలేని పిల్లలు. వాళ్ళ మనసులు తీర్చడమే నా ధ్యేయం. ఒక విధంగా వారికోసమే బ్రతుకుతున్నాను. అందుకే రెండో పెళ్ళి కూడా చేసుకోలేదు" అన్నారు.

కిష్టయ్యగారి మాటలంటున్నప్పుడు ఆయన గొంతు బాధగా భారంగా వినిపించింది. కళ్ళు చెమ్మగిల్లాయి.

"మీ అంతవాడు కోరుతుంటే పిల్లనియ్యనంటానా! నాకు మగపిల్లలిద్దరున్నా, ఆడపిల్ల ఇది ఒకర్తె. ముద్దు ముచ్చటలకు లోటు రానియ్యను. మీ కోరిక లేవో సెలవిప్పించండి."

## కొత్త ఉదయాలు

ఈ రక్తారుణ ఉషః సంధ్యా సమయాలు
ఏ కవి కలం నుండి వెలువడిన విప్లవ గేయాలు
ఈ దిగంత పరివ్యాప్త శకుంత నిస్వనాలు
ఏ సమరారంభ వేళా సముద్రిక్త శంఖారావాలు.

ఈ నవోదయ శిశునేత్ర కాంతి కిరణాలు
ఏ నియంతృత్వ శత్రువుపై ఎక్కుడిన నిశిత బాణాలు
ఈ నవ వికసిత మందారాలు
ఏ నవ సమాజ ముఖద్వారాలు
ఈ తూర్పుకొండ గుండె నుండి
వెలువడ్డ మార్తాండ బింబం
ఏ "మార్పు"ను మోసుకొచ్చిన
తరుణారుణ భావ కదంబం.

—కె. పావయ్యశాస్త్రి

"నా కోరికలు నువ్వు తీర్చేదేమిటయ్యా! నేనే తీర్చుకోగలను" అని నవ్వారు దర్పంగా.

గతుక్కుమన్నారు కామేశంగారు. మరేం మాట్లాడలో బోధపడక మౌనంగా వుండిపోయారు.

మరల కిష్టయ్యగారే అన్నారు.

"మా అబ్బాయికి కట్నకానుకలేం మీరియ్యక్కరలేదు. మీ పిల్లకి మీరేం పెట్టుకుంటారో మీ ఇష్టం. పెళ్ళి మాత్రం ఘనంగా చేయాలి. అంటే అర్థం అయిందా?" అన్నారు.

"దానిదేముందండీ. నాకూ ఒక్క ఆడపిల్ల. ఘనంగానే చేస్తాను."

"అది కాదయ్యా! మా జనాభాని భరించాలి."

"ఓస్ అంతేనా. ఊళ్ళో నా పలుకుబడి మీకు తెలియదు"

"సరే మమ్మల్ని మర్యాదగా ఆపాలి. మాట రాకుండా పెళ్ళి జరగాలి. అంతే మా కోరిక."

"తప్పకుండా! మీకేలోటూ రానియ్యను" అని భరోసా ఇచ్చారు కామేశంగారు."

## 11

శేషు పెళ్ళి పనులు ఘనంగా జరుగుతున్నాయి. ఓసారి రాజమండ్రి వెళ్ళాడు.

చదువు చెట్టెక్కించి తొందరపడి పెళ్ళి చేయించావని అలిగింది సరోజ.

"ఛీ ఛీ నేనేం చేయించలేదు. మన సంగతి ఎలా తెలిసిందో మా నాన్నకి తెలిసిపోయింది. అర్జంటుగా ఆయన ఏర్పాటు చేసేశాడు. నేనేం చేసేది సరోజా! చదువుదేం వుంది తరువాత ఇద్దరం కలిసే చదువుకుందాంలే" అని బ్రతిమాలుకున్నాడు.

"నేనా పల్లెటూరిలో ఉండగలనా?"

"ఆఁ చూస్తావ్‌గా మజా. అలా వుండలేకపోతే పట్నంలోనే మకాం పెట్టేదాం. సరా? చీరలు, నగలు ఏమేం కావాలో చెప్పు. మా నాన్నకి చెప్పి చేయించేస్తా. ఇంట్లోనే కంసాలి దుకాణం వుంది."

"ఏడ్చినట్లు వుంది. నాన్నకి చెప్పి చేయిస్తావ్. నువ్వేం చేయించ లేవుగా."

"అబ్బా ఏంటా దెప్పులు సరూ? అసలు ప్రేమికులు పెళ్ళి చేసుకోవడమే గొప్ప. మీ నాన్న మా నాన్న అడ్డురాక వియ్యమందుతుంటే ఆనందించక ఈ సాధింపులేమిటి? నేనింకా చిన్నవాణ్ని నాన్న చాటు బిడ్డని. నిన్న మొన్నటి దాకా నా చుట్టూ తిరిగి నా కోసం తల్లడిల్లిపోయి. ఇప్పుడు చేతికి చిక్కానని చులకన చేస్తున్నావ్?"

సరోజ నవ్వేసింది. "అది కాదు శేషూ. నువ్వెంతో పెద్ద చదువులు చదవాలని నా ఆశ. అదిలా అడ్డం తిరిగిందే అని నా బాధ."

"నీ ఆశ నెరవేరుస్తాగా"

"ఏమో బాబూ వివాహం విద్య నాశాయా అంటారు. అదింకా జరక్కుండానే పరీక్ష మంట పెట్టావ్ కదా"

"ఏం మాటలు సరూ" అన్నాడు. కోపం వచ్చి మూతి బిగించాడు. ఈసారి బ్రతిమాలడం సరోజ వంతయింది.

"సరే చదువెందుకులే. సంసారంలో పడదాం. మనకేం లేదా పోదా" అంది కిలకిలా నవ్వుతూ.

"అదీ అలా వుండాలి" అని చేయి పట్టుకుని దగ్గరకు లాక్కోబోయాడు.

"అగాగు తొందర పడకు. మరి కొద్ది రోజులేగా" అని లోపలికి పారిపోయింది.

శేషు. సరోజ కోపం చల్లార్చి చదివి తీరతానని శపథం పట్టి మరీ వూరు చేరాడు.

## 12

పెళ్ళివారు పాతిక బళ్ళమీద తరలి వస్తున్నారన్న వార్త కామేశంగారి చెవిని పడంగానే గాబరా పడిపోయాడు.

'కొంప దీసావ్ కదా కిష్టయ్య. ఇది పట్నం అనుకున్నావా? మీ ఊరనుకున్నావా. మనుషులకయితే తిండి అమర్చగలనుగాని గొడ్లకు అకస్మాత్తుగా గడ్డి ఎక్కడ తేను? బళ్ళు ఎక్కడ దింపను? మనసులో వాపోయారు కామేశంగారు.

తల బాదుకున్నారు. గాబరాతో కారేసుకుని బయలుదేరారు. ఆయన మిత్రుని కొకనికి కలప అడితి ఉంది. బళ్ళనీ అందులో ఆగే ఏర్పాటు చేశారు. పెళ్ళివారికి విడిదికని మాట్లాడిన మేడకాక మరో మేడతీసుకుని పల్లెటూరి రైతులందర్నీ అందులో ప్రవేశపెట్టారు వాడకం తెలియక ఏం తగలబెడతారో అని భయపడ్డారు మనసులో.

"బావగారు బలే ఘనంగా వస్తామన్నారు. ఇదా సంగతి" అని పైకి నవ్వేశాడు గాని, లోలోపల నిలువునా ఒణికి పోతున్నాడు. ఎక్కడేం లోటు వచ్చి గొడవలు వస్తాయో అని పల్లెటూరు వాళ్ళు. 'పల్లెటూరు మర్యాదలు అంటె ఏంటను కున్నావ్ చూసుకో నా తడాఖా' అని మీసం మేలివేశారు కిష్టయ్యగారు.

పెళ్ళి దర్జాగానే జరిగింది.

గొడ్లకీ, పాలేర్లకీ, రైతులకీ మర్యాదలు చేసేసరికి కామేశంగారి కాళ్ళు చేతులు చల్లబడ్డాయి. కూతుర్ని మాటి మాటికీ పల్లెటూరి వాణ్ణి ప్రేమించిందని మనసులో తిట్టు కున్నారు.

పెళ్ళి వారితో బళ్ళు తిరుగుముఖం పట్టాయి.

శేషు, సరోజా, పెళ్ళికూతురూ పెళ్ళికొడుకై బండెక్కారు తెల తెలవారుతుంటే బళ్ళు ఊరు చేరాయి. పెళ్ళికూతుర్ని పెళ్ళి కొడుకుని చెరువు దగ్గర ఆపారు. ముఖాలు కడిగించి పల్లకీ ఎక్కించారు.


ఆ చుట్టుపట్ల ఊళ్లు చుట్టబెట్టి ఊరేగుతూ పల్లకీ తిరిగి ఊరు చేరేసరికి పన్నెండు గంటలయింది. మధ్యలో పల్లకీ ఆపించి తాటిముంజెలు తినిపించాడు సరోజచేత శేషు. ఆ రోజు గృహప్రవేశం అయింది.

చుట్టూ చల్లని పందిర్లు వేశారు. వంటింటివేపు వేసిన పందిర్లలో రాసులకొద్దీ పోసిన అన్నం, పులిహోరా, బూర్లు చూస్తే సరోజ కళ్లు చెదిరిపోయాయి.

కోటకోడలు, బంధువులూ, ఆడబడుచులూ అంతా పందెంవేసుకున్నట్లు బూరెలు బుట్టలనిండా సర్ది ఊరు మొత్తానికి అందిస్తున్నారు.

ఇంట్లో ఎక్కడా నడుం వాల్చడానికి జాగాలేదు. దొడ్లో వో ప్రక్క పందిర్లో మంచం పరుపు వేయించి పడుకో మన్నాడు సరోజని.

చల్లని ఆ పందిట్లో ఒళ్ళు తెలియని నిద్రపోయింది సరోజ. అక్కడ మూడు రోజులూ అయ్యాక రాజమండ్రి వచ్చారు. రాజమండ్రిలోనే శుభకార్యం చేశారు.



PRASAD

మూడు నిద్రలూ ముగించుకుని వెంటనే వచ్చేయమని కొడుక్కి హుకుం జారీ చేసి మిగతా బంధువులతో ఆ మరు నాడే బండిలో ఊరు చేరారు కిష్టయ్యగారు.

పెళ్ళి ఘనంగా జరిగిందని ఊరంతా గొప్పగా చెప్పు కున్నారు. మూడు నిద్రలూ ముగిసాక సరోజ భయపడుతూనే ఆ పల్లెటూరు కాపురానికొచ్చేసింది.

కొత్త దంపతులకు పడగ్గదే కుదరలేదు.

పేరుకు గది వుందిగాని అది సరంబీ గది. కిటికీలుగాని వెంటిలేటర్సుగాని లేవు. తలుపు ఉందిగాని, వేసుకుంటే వూపిరాడక చస్తారు.

వచ్చిన నాడు రాత్రి జడకి పూలుకుట్టి, తెల్లచీర కట్టించి శాంతమ్మ అందరూ నిద్రపోయాక గదిలోకి పంపింది సరోజని. ఆ గది చూసి హడలిపోయింది సరోజ.

ఎత్తయిన పందిరి మంచం. దాని క్రింద అంతేఎత్తులో గుమ్మడి కాయలు. బూడిద గుమ్మడి కాయలు. ఒకే ఒక అలమారు. పైన సరంబీ. చిత్రంగా అన్నీ పరికించింది సరోజ.

శేషు తలుపులు బిగించి సరోజను మంచం ఎక్కించాడు గాని, చచ్చిపోతాను మొర్రో వూపిరాడడం లేదని గోల చేసి సరోజ తలుపు తీసేసింది. పైగా 'ఇంట్లో మీ అన్నా, వదినా కాపురమెలా వెలగబెట్టారు ? ఎలా పిల్లల్ని కన్నారు ?' అంది ముచ్చెమటలు పోస్తూంటే.

పకపకా నవ్వాడు శేషు.

మా అన్న వదినలు తలుపేసుకోరు. నేనూ అలా చెయ్యనా ? ఇటువయిపు ఎవరూ రారులే- లైటార్పేస్తాంగా.

ససేమిరా దాని కొప్పుకోలేదు సరోజ. శేషుని విడిపించుకుని ఇవతలకి చక్కా వచ్చేసింది.

"బావగార్ని లోపలే పడుకోమను అక్కయ్యా !" అని తన పక్క హాల్లోనే సరిచేసుకుంది.

సరోజ ప్రవర్తనకి తెల్లబోయింది శాంతమ్మ. మరెలా వారికి ఏకాంతం కూర్చాలో బోధపళ్ళేదావిడకి


శేషుకి చాలా కోపం వచ్చింది. "నువ్వు లోపలికి పోయి పడుకో అన్నయ్యా" అన్నాడు.

ఆదేంటో రాజుకి అర్థం కాలేదు. నిద్ర కళ్ళతోనే తూలుతూ వచ్చి తన పందిరి మంచం అధిష్టించాడు.

శేషు వరండాలోనే అన్నీ వేసుకుని మంచం మీదే పడు కున్నాడు.

ఆడబడుచుల మధ్య పడుకుని ఆలోచించడం మొదలు పెట్టింది సరోజ. 'ఈ ఇల్లు ఇంత వింతగా వుందేమిటి? ఏనాడు కట్టినదిది ? వంటింటికీ, పడమటింటికీ మధ్య తలుపు లేదు. పడమటింటిలో ముసలమ్మ. కచేరీ గదిలో మామగారు. ఒక వసారాలో కంసాలి వీరాచారి. వేరొక వసారాలో పాలేర్లు. వో కొట్టుగదిలో ధాన్యం బస్తాలు. వేరొక దానిలో బియ్యం రమ్ము. వప్పుదబ్బాలు పందికొక్కులు వాటి స్థావరాలు.

రెండో ప్రక్క వసారాలో వున్న చిన్న గది. దేముని గది. అందులోకి పాచి బట్టలతోనే వెళ్ళనియ్యదు ముసలమ్మ.



మడిగట్టుకునె వెళ్ళాలి. మరెలా తనూ శేష దాంపత్య జీవితం గడపడం ? రాజమండ్రి పోయి హాయిగా చదువుకుంటేనో ? మామగారు ఒప్పుకోవాలికదా ?

ఎంతకీ తెగని ఆలోచనలతో చివరికి నిద్రలోకి జారి పోయింది సరోజ.

## 13

సరోజ ఉదయమే లేచిపోయింది. ముఖం కడుక్కొని తోటికోడలికి పనుల్లో సహాయం చేస్తానని అడ్డం పడింది.

"వద్దమ్మా నువ్వేం పని చేయనవసరం లేదు.ముసలమ్మ గారున్నారు. నేనున్నాను. నౌకరులు చాకరులున్నారు. నువ్వు, శేషు అలా చిలకా గోరింకల్లా తోటలు దొడ్లు తిరిగి హాయిగా చదువుకోండి. అంతే చాలు మాకు" అంది.

తోటికోడలి ప్రేమ పూరిత వాక్యాలకి కరిగి పోయింది సరోజ. అయినా పొయ్యి అలుకుతానని పేచీ పెట్టింది. "ఈ పేడ ఎట్టి పనులు నీకెందుకమ్మా. అంతగా సరదాగా వుంటే గా వెలిగించి కాఫీ చెయ్యి చాలు" అంది.

సరోజ గబగబా కాఫీ చేసి పెళ్లలకిచ్చింది. భర్తని లేపి పేస్టు బ్రష్ ఇచ్చింది. నిద్రలేకా, కోపం చేతా కళ్ళు ఎర్ర బడి వున్నాయి శేషుకి.

గాజులు గలగల లాడించి చిలిపిగా నవ్వింది.

విసురుగా పేస్టు, బ్రష్ లాక్కున్నాడు.

'కుర్రాడు పాపం. నావాడేగా అలిగితే ఏం?' అను కుంది. ముఖం కడుక్కున్నాక కాఫీ అందించింది.

తరువాత తనకి అవసరం వచ్చి ఆడబడుచుల్ని అడి గింది.

పుంతలోకి పోవాలన్నారు.

'బాపురే! కొంప మునిగిందే. ఎలా బ్రతుకుతున్నారు వీళ్ళ ఊర్లో" అని గుండెల మీద చేతులు వేసుకుని వింతగా చూసింది.

బాల నవ్వి- "పర్లేదు వదినా. బోల్డు తుప్పలు, చెట్లు వుంటాయి. రా" అని లాక్కు వెళ్ళింది. చెంబూ, నీళ్ళు ఆడ పడుచులే పట్టుకున్నారు.

వీధిలో అంతా— అడుగడుగునా ఆపేసి మెళ్ళోగొలు సులు, నల్లపూసలు, మంగళ సూత్రాలు పరికించడం, బంగార మెంత అని అడగడం అవసరమై వెడుతుంటే ఈ అడగడా లేమిటి ? పల్లెటూరు మూర్ఖత్వం. లోలోపల ఇబ్బంది పడింది సరోజ.

కొత్త కోడలి ఇబ్బందులు మామగారికి ఎలా చెప్పాలో కాంతమ్మకి బోధ పళ్ళేదు. తన భర్త కద్ద మొద్దావతారం. తానూ కొత్తలో ఇబ్బంది పడినా అలవాటు పడిపోయింది. ఈ పిల్ల పట్నంలో సుఖాలు మరిగి అపురూపంగా పెరిగిన పిల్ల.ఏవి సర్దుకున్నా ఇలాంటి సున్నిత విషయాలు సర్దుకోవడం ఎలాగ ? ఆవిడకి అనుకూలంగా సదుపాయాలు కూర్చడమెలాగ ? ఆలో చనలు తెగక సతమతమయిపోయింది.

కిష్టయ్యగారు భోజనమూ, నిద్ర చేశాక వీధరుగు మీద వాలుకుర్చీలో కూర్చున్నాక మంగమ్మ, సమస్యని కిష్టయ్యగారి దృష్టికి తెచ్చింది.

"కొత్త కోడలు ఏమంటుంది ?"

"ఏమంటుంది చిన్న పిల్ల. ఏమంటే నీకెందుకు ?"

"నాగ్గాపోతే నీకేటి? పిల్ల బస్తీ పిల్ల. ఆ సరంబీ గదిలో తలుపు తీసి ఎలా తొంగుంటుంది? కొద్ది రోజులు మా ఇంటికి పంపెయ్యి."

"ఛీ ! ఛీ ! నోరుమూయ్యి."

"మరయితే అక్కు తలవడం ఎట్లా ?"

"నోరు మూసుకుందూ" చిరాకు పడిపోయాడు.

"ఏటి చేస్తావని అడుగుతుంటే నోరుముయ్యి మంట వేటి ?"


"ఆ చిన్నగుంటలు నోరుతెరిచి ఏటడుగుతారనీనిన్ను?"

ఇక మంగమ్మ వూరుకోదని తెలిసిపోయింది. తనేదో ఒకటి చెబితేగాని ఊరంతా టాంటాం చేస్తుంది. నిజానికి విష యం తాను దూరం ఆలోచించలేదు. అబ్బాయి పెళ్ళికి తొందర పడ్డారు. వాడికి చిన్న గది. వసారా వేయించాకే పెళ్ళి చేద్దును. ఇప్పుడు ముహూర్తం మించిపోయింది లేదు. "దక్షిణం పెరట్లో పునాదులు తీయిస్తాను గదికి. అందాకా సర్దుకు పోతార్లే."

"కొత్త గది కట్టే వరకూ కాపరం కుదరదన్న మాట ! పోనీ రాజమందిరం పంపెయ్యి."

"నీకెందుకు వూరుకుంమా.అబ్బాయిని ఇల్లరికం పంప తానా ? అదే బాగని ఆయన మచ్చిక చేస్తానో- వీల్లేదు. అలా వీల్లేదు."

"సరే ఆ గదేదో తొందరగా కట్టించు. నీ బుద్ధికి నీ గోలేగాని మరేదీ పట్టించుకోవని చెబుతున్నానంతే" అని చెంగు విసురుకుని లేచి వెళ్ళిపోయింది.



తిరువతమ్మ అదే అడిగింది.

పార్వతీ అదే అడిగింది.

తమ తమ ఇంటికి పంపమని కూడా చెప్పారు.

కిష్టయ్యగారికి తల కొట్టేసినట్లు అయింది. ఇన్నాళ్ళూ జయంగా చల్లగా పిల్లలతో వర్ధిల్లిన ఈ ఇంటి గుట్టు రచ్చ కెక్కుతుంది కాబోలని వాపోయాడు.

ఇటికామ తీయించే ఏర్పాటు చేద్దామని బయటకి వెళ్ళాడు.

## 14

దొడ్లో జామ చెట్టెక్కాడు శేషు.

మూతి బిగించి క్రింద నుంచుంది సరోజ.



"కోపమేల రాధ దయచూపవేల నాపై"

"మోసకాడవోయి పలుబాస లేల చాలునోయి"

పాడుకున్నారు. కిలకిలా నవ్వుకున్నారు.

దొడ్లు, పొలాలు, తోటలు ఎన్నో తిప్పి చూపాడు శేషు. ఇంక తిరగడం చాలు ఇంట్లో వుండండి అని శాసించాడు కిష్టయ్య.

రాత్రులు ఏకాంతం కుదరడం లేదు నూతన జంటకి. తనకీ బాధగానే వున్నా గది తయారు చేసేవరకూ వోర్చుకో- అని శేషుని కవ్విస్తూ నవ్విస్తూ ఏడిపిస్తూంది సరోజ.

గాది ప్రక్కకు రా అనీ, గడ్డిమేటుమీద వెన్నెట్లో పడుకుందామనీ ప్రాణం తీస్తున్నాడు శేషు.

గది తయారవనీ అని గుసగుస లాడి హాల్లో అడపడుచుల మధ్యే పడుకుంటోంది సరోజ.

కొత్త గది కోసం దక్షిణ పెరట్లో పునాదులు తీస్తున్నారు. ఉత్తర పెరట్లో లెట్రిన్ కోసం ఏర్పాటు చేస్తున్నారు. కొత్త కోడలి ధర్మమా అని ఇల్లుమారుతోందని అంతా పంతోషిస్తున్నారు.

ఇల్లు మారితే ఏం అరిష్టాలు జరుగుతాయో అని కిష్టయ్యగారు బాధపడుతున్నారు..

ఏదో తెలియని కసి, కోపంతో శేషు ఊగిపోతున్నాడు.

చదువా ఒంటబట్టడం లేదు. రోజూ గోదావరికీ, పొలాలకీ పిచ్చి పట్టినట్లు తిరుగుతున్నాడు.

## 15

తులశమ్మగారికి లీలచేత చేయించ వలసిన పూజలూ అన్నీ పూర్తయ్యాయి.

అయినా లీల నెల తప్పలేదు.





తులశమ్మగారు విరాళతో లీలను నిందించడం మొదలు పెట్టారు. "కని గొడ్డు ముఖమా! గొడ్డుమోతు దానా" అని.

లీల హతాశురాలయింది. తనకి పిల్లలు పుట్టరనే విశ్వ యానికి వచ్చేసింది. ఏం చెయ్యాలిక తాను?

రాత్రి పగలు విరాళతో ఇదే ఆలోచిస్తోంది.

ఓ రోజు లీల గదిలో నిద్రపోతోందనుకుని తుల శమ్మగారు కేశవతో అంటూంది.

"ఇది ఎన్ని పూజలు చేసినా దండగేరా! ఒంట్లో రోగమో ఏంటో. ఆచారి తొట్టిస్నానం చేయిస్తే మంచిదంటు న్నారు. వో నెల్లాళ్ళు అదీ చూసి దీన్ని పుట్టింటికి పంపేస్తాను. నెలనెలా కడుపు నొప్పి వున్నవారికి పిల్లలు పుట్టరుట. అన వసరంగా దానిచేత పూజలు చేయించి డబ్బు తగలేశాను. దీన్నిహ ఆఖరు పరీక్ష చేసి వదిలించేస్తాను. నీకు రెండో పెళ్ళి రాసి వుందేమో. నేనేం చెయ్యను? పిల్లలుగల ఇంటి పిల్లను వెతికి నీకు పెళ్ళి చేస్తాను."

లీలకింత వరకు బాగానే వినిపించాయి. ఆపై భర్త ఏమన్నాడో మరి వినిపించలేదు లీలకి.

భయంతో బిగదీసుకుపోయింది. ఆదుర్దాలో గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. అసలే మతిపోతుంటె పులిమీద పుట్రలా అప్పుడే తనని వదిలించెయ్యాలని అత్తగారి ఆలోచనలా? అయ్యో! ఇక తనగతి ఏమిటి?


పుట్టిల్లు, తనకి తల్లి లేదు. సోదర సోదరీమణులు లేరు. సవతితల్లి.ఆమె బిడ్డలు.తండ్రి వున్నప్పుడే అంతంతమాత్రం! ఇప్పుడు పిల్లాపాపా లేక పుట్టిల్లు చేరితే ఇంకేమైనా ఉందా? తనకి పోనీ పిల్లలయినా కలిగారు కాదు ఇన్ని పూజలు చేసినా. ఏంటిక దారి. గోదారి తప్ప?

గోదారి గుర్తు రాగానే శేషు గుర్తుకొచ్చాడు. కళ్ళు తళతళ లాడాయి. మనసు రెపరెపలాడింది. కాని కాని. ఎలా సాధ్యం? తన భర్తలో ఏదో లోపం ఉంది. అందుకే తనకి పిల్లలు పుట్టడం లేదు. తను అలా చేయాలి. అవును చేయాలి. పాపమేమో-మరలసంకోచం.తనకి పిల్లల్లేరని చెప్పి పుట్టింటిలో వదిలేయాలని ఆలోచించడం పాపం కాదూ? తన భర్తకి మళ్ళీ పెళ్ళి చేస్తుందా? దానికీ పిల్లలు లేకపోతేనో- అసలు భర్తలోనే లోపం ఉండి ఉండాలి. అది తెలుసుకోవడం ఎలాగ? ఎలా గేంటి? అలాగే పురాణాల్లో మాత్రం సంతానం లేకపోతే ఎందరు ధర్మసంతానానికి పోలేదూ? తమ వంశం భర్తవల్ల కాదు తన వల్లే నిలబడాలి.ధైర్యం సాహసం చెయాలి, ఏమైనా సరే విజయమో వీరస్వర్గమో తేలాలి. ఎలాగూ తనని వది లేస్తా మంటున్నారు. ఇలాగే వదిలెయ్యనీ. అంతా ఆ భగవం తునిదే భారం. సాహసం చెయ్యాలి. తప్పదని లీల ఒక నిర్ణ యానికి వచ్చి కార్యదీక్షలో మునిగిపోయింది.

సరోజకి పెందరాళే భోజనం చేసే అలవాటు. అందు కని తోటికోడలు వేపుడు చారుతో ఇవతల స్టౌ మీద వంట చేసి ఇద్దరికీ పెడుతోంది. మిగతావారు చద్దిఅన్నాలు తింటారు. భోజనమయ్యాక శేషు అటూ ఇటూ పోతున్నాడు గదిలో ఓవార

# చిటుకులు

# నరకుడు మళ్ళీ పుట్టాడు!




బాత్‌రూంలో కిరోసిన్
మండుతున్న వాసన దట్టం
కన్నూ మిన్నూ కానక
కళ్ళు ర్రి చెలరేగిన ఘట్టం
కొత్త కోడల్ని
చిదిమి
పెట్టిన దీపం
ఆకాశపుటంచుల్ని నాకుతోంది
వళ్ళు కాలిన
అసహాయత కేక
దిక్కుల గుండెల్ని తాకుతుంది
తళతళల
ఫెళఫెళల మధ్య
నవ్వుతూ వచ్చిన
నరకుడు
మధుపర్కం కట్టుకొని
పెండ్లిపీటలపై కూర్చున్నాడు,నంగిగా
-కాళ్ళు కడిగి
మనం
నెత్తిన చల్లుకుంటూ వుండగా
ఎందుకు జరుపుకుంటున్నట్లో
ఈ
దీపావళి పండుగ?

— భండారు పర్వతాలరావు.

ప్రక్క వేసుకుని కాస్సేపు చదువుకుని ఆ తరువాత నిద్ర తీస్తోంది సరోజ

హాల్లోనో.వసారాలోనో పేకాట. ఒక వసారాలో సాంబ మూర్తి హడావిడి. ఆడపిల్లలు వీధరుగుమీద చింతపిక్కలాట. కిష్టయ్యగారికి పొలం పనులు. కాంతమ్మగారికి, ముసలమ్మ గారికి వంటింట్లో వంట.

అడబడుచులకు చదువు చెప్పడానికి ప్రయత్నించి విఫలురాలయింది సరోజ. వాళ్ళు రెండు రోజులు విన్నట్లే విని తోక జాడించారు. తోటికోడలు పిల్లలకి స్నానాలూ అవీ చేయించి కాస్సేపు చదివించి, అటకు వదలి తను చదువులో మునిగిపోతుంది.



శేషుకి కోపం. పుస్తకం ముట్టడం లేదు. సరిగా మాట్లాడటమే లేదు. తనేం చేస్తుంది! గది తయారవుతోందిగా అప్పటి వరకు విరహం తప్పదు. తను పల్లెటూరివారిలా ఏ చెట్టుక్రిందో, గడ్డి క్రిందో కాపురం చేయలేదు. పోనీ రాజమండ్రి పోతామంటె మామగారికి నామోషి. పోనియ్యడు. "వెడితే గది తయారయ్యాకే, గృహప్రవేశం అయ్యాకే వెళ్ళండి" అంటాడు తన గొప్ప తక్కువ అవుతుందని. కానియ్యి పోయిందేముంది. కొద్దిరోజులు చదువు సాగుతుంది.

## 17

తులశమ్మగారికీ, తమకీ మధ్య ఉన్న పెరటిగోడ ఎక్కాడు శేషు. తమవైపు వున్న గోడవారే జామచెట్టువుంది. జామచెట్టు ఎక్కడం, కొమ్మెక్కి ఊగడం, చిలకలతో కులకడం, కైపెక్కి కూనిరాగాలు తీయడం శేషుకి అలవాటే.

ఆ రోజూ అలాగే జామచెట్టు ఎక్కాడు. కొమ్మమీద కూర్చున్నాడు. కూనిరాగం అందుకున్నాడు.

"రా చిలుకా, రా రామచిలుకా, పలుకవేలనే, అలుక ఏలనే చిలుకా రా, రామచిలుకా" కూనిరాగం తీస్తున్నాడు.

రావలసిన సరోజ రాలేదు.

తులశమ్మగారి గది తలుపు తెరుచుకుంది. లీల ప్రత్యక్షమయింది.

శిల్పి చెక్కిన చక్కని శిల్పంలా చెక్కిలి చేయి చేర్చి, గుమ్మంలో చిన్నగా నవ్వుతూ నించుంది.

ఆమెనలా శేషు ఎప్పుడూ చూడలేదు. ఏదో పని హడావిడిలో అటూ ఇటూ సందులోనో దొడ్లోనో తిరుగుతూనో-లేదా గోదావరి దగ్గర స్నానాలూ ప్రదక్షిణాలూ చేస్తూండగానో చూసాడు. కాని ఇలా చక్కని శిల్పంలా చెక్కిలి చేయి చేర్చి చిరునవ్వులొలకబోసే సుందర్ని చూడలేదు.

తనని చూడగానే మరింత కులాసాగా నవ్వింది. చూపుల్లో చూపు కలిపి చూసింది. ఆ చూపులు తనని పిలుస్తున్నట్లు అనిపించి కలవరపడ్డాడు. గొంతు తగ్గించాడు. క్రమంగా పాట ఆపేశాడు. కొమ్మమీద నుంచి సరిహద్దు గోడమీద కొచ్చాడు కళ్ళు చిన్నవి చేసి చూసాడు.

ఇంకా ఆమె అలాగే చూస్తుంది. చూసిచూసి రమ్మని చేయి ఊపింది. అర్థం అయిపోయింది శేషుకి. అయ్యాక గుండె దడదడ లాడింది. అటూ ఇటూ నాలుగువైపులా చూశాడు. ఆమె రమ్మని మళ్ళా పిలిచింది.

పరవాలేదని, ఎవరూ లేరని చేతితో సౌంజ్ఞ చేసింది. ఇంక ఆలోచించలేదు. వాలి ఉన్న జామకొమ్మ ఆధారంగా, అధాటుగా ఛెంగున దూకాడు.

క్షణాలమీద అతడు గదిలో ప్రవేశించడం లీల గదిలో తలుపులు మూసెయ్యడం జరిగాయి.

అతన్ని చెయిపట్టి మంచం దగ్గరకు లాక్కెళ్ళింది లీల. మంచంమీద కూర్చోడమే తడవుగా తనని కౌగిలిలోకి లాక్కుంది లీల.

అసలే ఆరాటంలో ఉన్నాడేమో లీలని బిగియారా కౌగలించుకుని ముద్దులతో ముంచెత్తాడు.

"లీలా! ఏమిటీ సాహసం" అన్నాడు చెవి దగ్గర గుసగుసగా.

అతని వేడి ఊర్పులు లీల చెంపల్ని తాకి కితకితలు పెట్టాయి. ఏదో తెలియని పారవశ్యంలో మునిగి పోవడమేకాదు కోడెగాడు దొరికాడని లీలకి గర్వంగా కూడా ఉంది.

చిలక్కొడితేనేం చక్కని జామపండు దొరికిందని శేషు సంతోషం.

"సాహసమే. పిల్లలు అత్తగారికి కావాలి, నాకు సరదా కావాలి. రెండూ కలిసొచ్చాయి. కొత్త పెళ్ళికొడుకువని కాస్త ఆలోచించాను. మీ ఇంటి వార్తలు తెలుస్తూనే వున్నాయి. గది తయ్యారవాలిగా అందాకా నీ నా ఇబ్బందులు ఈ దెబ్బతో తీరాలి. ఎలా వుంది మన ప్లాను?"

కిలకిలా నవ్వుతూ 'బ్రహ్మాండంగా వుంద'నేమో ఆ పెదవుల్ని అందుకున్నాడు. మళ్ళా సందేహం "నీ భర్త అత్త ఏమయ్యారు?"

"ఆవిడ గోదావరికి పోయింది. అతను పొలం పోయాడు. నాకు గోదావరి స్నానాలు తప్పాయి. ఆవిడ పన్నెండు దాటితేగాని రాదు. అతను సాయంత్రం దాకా రాదు. ఆవిడకి తలుపు నేనే తియ్యాలిగా. నిన్ను పంపే తీస్తానులే."

"రోజూ ఈ అవకాశం వస్తే ఎంత బాగుండును?"

"వచ్చింది డబ్బు తెచ్చి రడీగా వుంచారు. రేపటి నుంచి నేను తొట్టిస్నానం చెయాలిట. కొన్ని గంటలు తలుపు వేసుకుని. ఆ తొట్లో సరియైన బాతురూం లేదుగా, అందుకని ఈ గది ప్రక్క వసారా గదిలో ఏర్పాటు చేశారు."

"నీ స్నానానికి నేను తోడు రావాలి. అవునా"

"మీ వాళ్ళకి తెలిసినా, మా వాళ్ళకి తెలిసినా?" భయసంకోచాలని వెలిబుచ్చాడు.

"మా వాడు పొలం పోతాడు. అత్తగారికి గోదావరిలో మంత్రాలూ, పూజలూ అయివచ్చేసరికి నిన్ను పంపేస్తాగా. నా తరపునుంచి నేను హామీ ఇస్తున్నాను. నీ తరపు నుంచి నువ్వు చూసుకో అందునా కొత్త పెళ్ళాం" కిలకిలా నవ్వింది.

కొత్త అనుభవం తేషుకి. చాలా సరదాగానూ వుంది. భయంగానూ ఉంది. చడీ చప్పుడు కాకుండా డామచెట్టెక్కి వచ్చేసాడు. ఇంట్లోకి వచ్చాక సరోజ దగ్గరికి రావడానికి భయం వేసింది. పిల్లిలా గదిలోకి వచ్చి చూస్తే సరోజ నిద్రపోతూంది పుస్తకం గుండెలమీద పెట్టుకుని.

'నిద్రపో. అలాగే నిద్రపో కొద్ది రోజులు.'

కొంత కసి, కొంత జాలితో మనసులో అనున్నాడు. 'లిం కోరినదైనా కొద్ది రోజులేగా. పరవాలేదు.' అని తనూ సరోజ ప్రక్కనే పడుకుని పుస్తకం తీశాడు.

## 18

"రోజూ నా కోసం వేడి అన్నం ఎందుకక్కయ్యా? నేనూ చద్దన్నం తింటాను" అంది సరోజ వోరోజు.

"పోనీ టిఫిన్ చేసుకోరాదూ నీమట్టుకి?"

"వద్దు అక్కా! నా ఒక్కదానికే టిఫెన్ ఎందుకూ? ఎప్పుడైనా మధ్యాహ్నం ఎలాగూ చేసుకుంటాంగా. నేను వదినలతో చద్ది అన్నం తినేస్తాను. ఆ తరువాత నీ వంటయ్యాకే తిటాంను."

'పట్నవాసం పిల్లయినా ఎంత బుద్ధిమంతురాలు?' అనుకుంది మనసులో కాంతమ్మ.

ఆ రోజు లగాయితూ రోజూ ఉదయం కాఫీ తాగాక ఏడూ ఎనిమిదీ ఆ ప్రాంతాల్లో చిల్లర పనులు అయ్యాక సరోజా, కాంత పిల్లలూ, ఆడబడుచులూ, అంతా ఒక్కసారిగా



చద్ది అన్నాలకి కూర్చోవడం, ఒకరిమీద ఒకరు పోటీపడి ఆవకాయ, గోంగూర పచ్చడీ, పెరుగు, మామిడి పళ్ళతో భోజనం కానిస్తున్నారు.


ఈ మజా అయిన భోజనం సరోజకు మత్తు గొలుపుతోంది. ఆ పల్లెటూర్లో అన్నీ పుష్కలంగా వుండటం దేనికీ కరువు లేకపోవడం సరోజ కెంతో నచ్చింది. కాని కష్టపడే వాళ్ళు చాలా తక్కువ. సోమరులు ఎక్కువ. ఆ వూళ్ళో పుట్టిన ఆడపిల్లలు ఇష్టమొచ్చినట్లు తిరగొచ్చు. కోడళ్ళు తిరగకూడదు.


Dabur Chyawanprash
the world's best known Ayurvedic tonic






Dabur
CHYAWANPRASH
Your family's
natural health tonic



ఊళ్ళో అజ్ఞానం. మూఢనమ్మకాలు చాలా వున్నాయి. చదువు సంధ్యా వాటిపట్ల ఆసక్తిలేదు. ఎంతసేపు మస్తుగా తినడం, చిత్తుగా తిరగడం. పేకాటలు. తిరుగుళ్ళు ఎక్కువ.

ప్రాణం పోతుందన్నా ఒక మందుగాని మాకుగాని దొరకదు. అన్నింటికీ రాజమండ్రి పోవాల్సిందే.

గోదావరి ఊరికి దూరం. నీటి వసతి వూరి మొత్తం మీద ఒకటే నుయ్యి. ఆ నుయ్యి దగ్గరే అందరూ స్నానాలు.

అందరూ కాలకృత్యాలు తీర్చుకోవడానికి పుంతలోకి పోవలసిందే. స్త్రీలకి వేరుగా, మగవారికి వేరుగా పుంతలు వున్నాయి.

ఆ చిన్న ఊరులోని ఈ లోపాలు సవరించి వెలుగులోకి తీసుకురావాలనీ, ఉత్తేజాన్ని కలిగించాలనీ, విద్యని, విజ్ఞానాన్ని ఆ వూరుకు ప్రసాదించాలనీ సరోజ తపన. ముఖ్యంగా ఇంటినీ, ఇంటి వాతావరణాన్నీ మార్చాలి. దానికి పథకాలు ఆలోచిస్తోంది సరోజ.

## 19

శేషు తన పద్ధతి మార్చేశాడు. రోజూ సరోజ కూడా కూడా తిరిగి చద్ది అన్నం తినడం, పుస్తకాలు పట్టుకుని సరోజతోపాటు ఆ గదిలోనే కూర్చునీ పడుకునీ చదవడం. మధ్య మధ్య సరససల్లాపాలూ. చిలిపి కజ్జాలు.

పాపం అలవాటు లేని చద్దన్నం ఆపై పుస్తకాలు చదవడంతో సరోజ చూస్తుండగానే నిద్రలోకి జారిపోతుంది.

సరోజ నిద్రలోకి జారగానే జామచెట్టు కొమ్మల్లో దాగడం చిలక్కొట్టిన జామపళ్ళు కొరుక్కుని తినడం. రామచిలక కోసం కొమ్మల్లో, రెమ్మల్లో నక్కి చూడ్డం లీల పిలువందగానె అటు చూసి ఇటు చూసి ఛెంగున జామ కొమ్మ ద్వారా పక్కింటి పెరట్లోకి దూకడం. తరువాత గది ప్రవేశం.

ఆ తరువాత లీలతో సరిగంగ తొట్టి స్నానాలు, నవరసాల సరసాలు. నెల రోజులు నాలుగైదు రోజులు తక్కువగా. ఏ రోజూ ఎవ్వరికీ అనుమానం రాకుండా తన శృంగారలీల జరుపుకున్నాడు శేషు.

## 20

లీల నెల తప్పింది. తులశమ్మ సంబర పడిపోతుంది.

తొట్టిస్నాన వైద్యం పని చేసిందనుకుంటోంది.

దురదృష్టవశాత్తు దొడ్డితలుపు వేయడం మర్చిపోయిందో రోజు లీల వీధి తలుపు తట్టిన తులశమ్మగారు లీల ఎంతకీ తలుపు తీయకపోతే దొడ్డివైపు నుంచి పిలుద్దామని అటు వైపు వచ్చింది. దొడ్డి తలుపు తీసే వుంది. "నీకిదేం పోయ్యేకాలమే దొడ్డి తలుపు తీసి వుంచావ్?" అని ఆవిడ సణుక్కుంటూ సందులోకి రావడం శేషు ఛెంగున జామకొమ్మ అందుకుని గోడ దాటడం ఒకేసారి జరిగాయి.

శేషుని తులశమ్మగారు చూసింది. క్షణం తత్తరపడింది. ఆశ్చర్యపోయింది. నోట మాటరాక కాస్సేపు తెల్లబోయి నిలబడి పోయింది. ఆ తరువాత వూరుకోలేక నోరు పారేసుకుంది.

"నీకేం పొయ్యేకాలం శేషూ! మా దొడ్లో దూకి ఏం చేస్తున్నావ్?" అంది ఆవేశంతో రొప్పుతూ.

శేషుకి జవాబు చెప్పక తప్పలేదు.

"జామపండు పడిపోతే దూకానమ్మా! ఏమిటంతగా అరుస్తున్నావ్" అన్నాడు.

"ఎందుకురికావో కనుక్కుంటానుండు" అని విసవిసా లోపలికి వెళ్ళిపోయింది.

లీల తనకేమి పట్టనట్లు చీర సింగారించి గదిలోంచి హాల్లోకొచ్చి "ఏంటత్తయ్యా గొడవ" అంది గుండెల్ని అదుపులో పెట్టుకుంటూ.

జవాబుగా కోడల్ని జుట్టు పట్టుకుని ఒంటింట్లో కీడ్చి రెండు తన్ని, గుంజి, గొంతు తగ్గించి "చెప్పు వాడితో ఎన్నాళ్ళ నుంచి సాగుతుంది నీ వ్యవహారం?" అంది.

"ఎవడు వాడు? అత్తయ్యా? ఏంటి నీ గోల" అంది విసురుగా జుట్టు లాక్కుని.

"ఏం నంగనాచివే ఎవడు వాడు అంటావా? ఆ శేషిగాడే"



"వాడా ఏం చేశాడు" అంది ఏమీ ఎరగనట్లు.

"ఏం చేసాడనే నేనూ అడుగుతుంట."

"నాకేం తెలియదత్తయ్యా. అనవసరంగా నోరు పారేసుకుని పరువు మంటగలపకు. వాడెప్పుడూ కొంటె వాడే. వాడేదో చేస్తే అనవసరంగా నన్నాడి పోసుకోకు."

"అయితే వాడు మన దొడ్లోకి ఎందుకు దూకాడు?"

"ఏమో కుర్ర వెధవ. ఎండ బెట్టిన వడియాలు నోరూరించాయో, ఏ రాచ వుసిరి కాయల కోసం దూకాడో. వాడికలాంటి అలవాట్లు వున్నాయి."


"దొడ్డి తలుపెందుకు తీసుంది?"

"బాగుంది వరస. మీ అబ్బాయి ప్రొద్దుట తలుపెయ్యమని చెప్పడం మరిచారో- వేయడం పని హడావిడిలో నేనే మరిచానో- పాలేరు వెధవ చెప్పకుండా తీసిపోయాడో ఏదో జరిగుండాలి."

"నువ్వేం చేస్తున్నావూ అంట."

"నే చూశ్చేదంటున్నానుగా. ఇహ వూరుకో" అని ఎదురు కసిరింది.

దాంతో అప్పటికి వూరుకున్నా మనసు ఊరుకోలేదావిడకి. అనుమానం రాకపోవాలేగాని, వచ్చాక అంత సులభంగా పోతుందా? మనసు రగిలి పోతుంది! పరువు సంగతి ఆలోచిస్తోంది.



## 21

ఇహ శేషు ఇంట్లో అంతా తెల్లబోయి చూశారు. శేషు రుసరుసలాడుతూ ఇంట్లోకి వచ్చాడు. "ఏంటలా పిచ్చిపట్టినట్లు చూస్తారు? తులశమ్మ సంగతి మీకు తెలియదా?" అని దబాయించి గదిలో మంచం మీద వాలిపోయాడు. పైగా తెల్లబోయి చూస్తున్న సరోజని విసనకర్రతో విసరుతున్నాడు.


# VISAKHAPATNAM
# DEEPEST PORT OF INDIA
## Golden Jubilee Year (1983-84)

- Giving shelter to ships upto 1,20,000 D.W.T.
- Achieving record loading rates for Iron Ore, Wheat, Coal, Steel coils, etc.
- Providing a unique 50 tonne gantry crane with 50,000 sq.m. storage space for handling Containers and other heavy cargo.
- Assisting the Steel Plants at Bhilai, Bokaro and Visakhapatnam.
- Having the most modern fishing harbour of the country.
- Building India's deepest general-cum-bulk cargo berth and Oil berth.

VISAKHAPATNAM PORT TRUST

మగని వంటిమీద చెమటలు. ఏదో అతడు తప్పు చేసి నట్లే పట్టిస్తున్నాయి. ఉండలేక అడిగింది.

"గోడ దూకడమెందుకూ ?"

"నీకూ అనుమానం వచ్చిందీ ? నోరు మూసుకుని ఊరుకో" అని కసిరాడు.

శాంతమ్మకి లీలగా అర్థం అయింది. కిష్టయ్యగారి గుండె గతుక్కుమంది. అయినా ఏమీ జరగనట్లే సర్దుకున్నారు.

ఆయన గంభీర ముద్ర చూసి ఎవరూ ఏమీ వ్యాఖ్యానించడానికి సాహసించలేదు. మంగమ్మ మధ్యాహ్నం వచ్చింది గాని వెంటనే ఆమెను ఇంటికి తరిమేసారు.

ఆ సాయంత్రం చీకటి పడుతుంటే కేశవ కత్తి పట్టుకుని ధాం ధూం అంటూ వీధిన పడ్డాడు. అదీ ప్రక్కన పాలేరు లున్నారు కాబట్టి ఆ ధైర్యం.

"నా పెళ్ళాన్ని ఎవడ్రా ఆటలు పట్టించాడు ? దమ్ములుంటే రారా కత్తితో ఒక్కటేస్తా. నా పెళ్ళాంమీద అత్యాచారం చేస్తే నేనూరుకుంటాన్రా. రారా వీధిలోకి. నీ పెళ్ళాన్ని కాసుకో ఎప్పుడో పరాభవం చేసి వదులుతా" అని వీరావేశంలో ఊగిపోయాడు.

వీధిలో నలుగురు చేరి అతన్ని పట్టి లోపలకీడ్చారు.

శేషునీ, సరోజనీ గదిలోపెట్టి గొళ్ళెం పెట్టేసింది శాంతమ్మ

"ఛీ!ఛీ!ఎంటాగోల" అని అవమానం భరించలేనట్లు వడివడిగా అడుగులేసుకుంటూ పొలంలోకి వెళ్ళిపోయారు కిష్టయ్యగారు.

"మనవాడి కృష్ణలీలలు కాబోలు" అన్నట్లుగా భార్య ముఖంలోకి చూసి భావయుక్తంగా నవ్వాడు రాజు.


పాలేర్లు నాలుగు వాకిళ్ళు మూసి, తగూ వస్తే తామూ సిద్ధమే అన్నట్లు కూర్చున్నారు.

అన్న వదినలకేమవుతుందో అని లలితా బాలా గది గుమ్మం దగ్గర బిక్కచచ్చిపోయి వింటున్నారు.

"ఏడిశాడు. తులశమ్మ బుర్ర ఈసుత్తితో బాత్తే-కేశవకి బుద్ధి వస్తుంది" అన్నాడు సాంబ.




# సూర్యుడు రేపొస్తాడు



నిశ్శబ్దం ఒడిలో వెచ్చగా
రోడ్డు నిద్రపోతూంటుంది
ఆ రోడ్డుని 'మె.శ.కు.వ'లో నింపాల్సిన
పాదాలూ నిద్రపోతూంటాయి

సందులు, యిళ్ళు, హృదయాలు
అన్నీ చీకటిలో కూరుకుపోయి వుంటాయి.
'ఆ.లో.చ.న' మాత్రం తీగలా సాగుతూ
సాలెగూడులా అల్లుకుంటూంటుంది.
అందులోంచి 'క.ద లి.క.' మొలకేస్తూ-
అప్పుడప్పుడు - బయట బయటకి
తొంగి తొంగి చూస్తూ-
చెయ్యి చాచి ఓ చంద్ర కిరణాన్ని
గుప్పిట్లోకి దొరకబుచ్చుకుంటుంది.
అప్పుడు-
పారిజాతాలు గుప్పుమంటాయి.
బుల్లిపాపాయి నిద్రపెదాల మీద
పాలనవ్వు అలగా కదుల్తుంది.

....కలిదిండి జయ

"లీల మంచిపిల్ల దాని తప్పేంలేదు" అని వ్యాఖ్యానించింది తిరుపతమ్మ.

"ఊపిరాట్టంలేదు గదిలో, తలుపు తియ్యి అక్కయ్యా!" అని తలుపు దబదబ బాదడం మొదలుపెట్టింది సరోజ. శాంతకి తలుపు తియ్యక తప్పలేదు.

ముసలమ్మగారు ముందుకొచ్చి ఆమె చెయ్యిని అందిపుచ్చుకొని, దేముని గదిలోకి నెట్టి గొళ్ళెం పెట్టారు. ఆ గొళ్ళెం తీసుకుని శేషు అందులో దూరాడు. సరోజ చేతులు పట్టుకుని "నన్ను క్షమించు సరోజా" అన్నాడు. మనసులో మాత్రం వ్యవహారం ఇలా ఎదురు తిరిగిందేమిటి? ఇందులో లీల పాత్ర ఎంత? అని విస్తుబోతున్నాడు.

"నేను క్షమిస్తే ఏమయినట్లు? అతగాడు క్షమించాలి మిమ్మల్ని" అంది, ముక్కుపుటాలు రోషంతో అదురుతుండగా.

శేషు ఆమెను అన్నిరకాలుగా బ్రతిమాలాడాడు. కరిగి నీరై పోయింది సరోజ. 'పాపం పసివాడు ఏదో తప్పుచేశాడు, ఇప్పుడు కర్తవ్యం ఏమిటి?' అని ఆలోచిస్తూ ఆలోచిస్తూ నిద్ర

పోయింది. ఆ పూట భార్యభర్తలకి పాలు మాత్రం వెళ్ళాయి. ఆ రాత్రి సరోజా శేషూ ఒకర్ని ఒకరు కరిచి పెట్టుకుని పడుకున్నారు.

ఆ రోజు దేముడు మైలపడతాడని గోల చేయలేదు ముసలమ్మగారు. మూగబాధతో మగతనిద్రలోకి జారిపోయారు శేషు, సరోజ.

## 22

వీధిలో వీరావేశం చల్లారాక గదిలో భార్య పనిపట్టాలని చూశాడు కేశవ. ఈ గడబిడలో ధైర్యాన్ని కోల్పోతే లాభం లేదని మరింత ధైర్యాన్ని తెచ్చుకుని ధీమాగా నిలబడింది లీల. పిరికి వెధవ. పిట్టమనిషి వీడెంత అనుకుంది మనసులో.


అతని చేతిలోని కత్తిని పాలేర్లు లాగేసుకోగానే ఎక్కడ లేనంత ధైర్యం వచ్చేసింది లీలకి. భర్తని అమాంతం లాగి గది తలుపులు గడియపెట్టేసింది. "ఏమిటే నీ టక్కరి వేషాలు" అని చాచిపెట్టి ఒక్కటి కొట్టాడు. లీల గూబ గుయ్యిమంది. అయినా అతని చెయ్యినలా వడిసిపట్టుకుంది. కాని దుఃఖం నటిస్తూ, "నా మాట వినండి. ఇలా కూర్చోండి. తొట్టి స్నానం ఫలించి నాకు నెల తప్పింది. మీ అమ్మ ఓర్వలేక మీకు రెండో పెళ్ళి చేస్తే మళ్ళీ కట్నం వస్తుందని అది పోతోందనీ ఈ పన్నాగం పన్ని మీ మనసు పాడు చేసింది. క్రుురవెధవ శేషు నన్నల్లరి పెట్టలేదు. వాడితో నాకు పనిలేదు. ఏ జామకాయకో వుసిరి కాయకో దొడ్లో కనిపిస్తే ఇంత రాద్ధాంతం చేసింది మీ అమ్మ. అవ్వా! పరువేమైనా వుండాలా? ఆ కిష్టయ్యగారికి కోపం వస్తే మన పంటలు ఆగుతాయా? అయినా లేక లేక నాకడుపు పండుతుంటే, ఏంటాగోల? ఆవిడ మాటలు నమ్మకండి. మీరు తండ్రి కాబోతున్నారు" అంది. అంత దుఃఖాన్ని ముసిముసి నవ్వులోకి మార్చేస్తూ.

ఆ చివరి మాట కేశవ మనసుకి చల్లగా తాకింది. కేశవ చల్లబడిపోయాడు, అది చూసి విజృంభించింది. "సంతోషంగా ఉండవలసిన సమయమంతా పాడుజేసెయ్యాలని మీ అమ్మ పన్నాగం. ఇక నేనూ ఒక అమ్మనవుతున్నాను. నన్నునమ్మండి" అంది గర్వంగా.




## ఆశ చావదు

ఆశలు ఆవిర్భవించి
నిరాశలు అడ్డురాగా
నిట్టూర్పులతో ఆవలి తీరానే
ఆగిపోయి, విసిగిపోయి
విలయతాండవం చేస్తూ
హృదయాన్ని కదిలించి,
మమతని పెకలించి,
అనురాగంతో జతకలిసి
కొత్త చిగురుగా పూసి
మళ్ళీ చిగురిస్తుంది
'ప్రేమ' అనే నెపంతో!



—దేవి

నిజంగా నమ్మాడు. నీరుగారి పోయాడు. వెంటనే లీల అతణ్ని తన బాహువుల్లోకి తీసేసుకుని బంధించేసింది.

## 23

ఈ వార్త ఎలా అందిందో కామేశంగారి కందింది. ఆఘమేఘాల మీద వొచ్చి, వియ్యంకుడి మీద విరుచుకు పడ్డాడు. "ఏంటయ్యా ఈగోల, దిక్కుమాలిన పల్లెటూరిచ్చి దగాపడ్డాను. పిల్లనీ, అల్లుణ్ని తీసుకుపోతాను, కనీసం మా అమ్మాయినైనా తీసుకుపోతాను" అని పట్టుబట్టి కూర్చున్నాడు. తండ్రినోరు సరోజే ఆపుజేసింది. "ఏంటి నాన్నా! చిన్న పిల్లాడిలా ఆ తొందరపాటు. ఇపుడు నాకేమిటయిందని? అజ్ఞానం పేరుకు పోయింది పల్లెటూర్లలో. ఏవో చిన్నచిన్న గొడవలు జరుగుతాయి. నాలాంటి విద్యావంతులుండి, ఇలాంటి ఊర్లు బాగు చెయ్యాలిగాని, పారిపోతానా పిరికిగా? నాకిక్కడేం లోటు జరగడంలేదు. నాకోసం మామగారు కొత్త గది వేయిస్తున్నారు. నన్ను చిన్నపని ముట్టుకోనియ్యదు అక్కయ్య. పాలు పెరుగు నెయ్యి ఇలాంటివి చస్తే మన పట్నంలో దొరకవు నువ్వు మా గొడవల్లోకి రాకు. వెళ్ళిపో. మాకు వీలు చిక్కినపుడు సరదాగా ఉన్నపుడు మేమే వస్తాం. అసలు ఈ ఊరుని బాగు చేయందే నేను నిద్రబోయేదిలేదు" అంది.

"ఎంత ఆరిందావై పోయావమ్మా! కొద్దిరోజులు వచ్చిపోరాదూ" అన్నాడు.

"తరువాత వస్తానన్నానుగా" అని తండ్రిని పంపేసింది.

కోడలు బాగా చెప్పిందని లోలోపల మురిసిపోయారు కిష్టయ్యగారు.

అసలు ఈ రెండురోజుల నుంచీ చాలా తీవ్రంగా ఆలోచిస్తోంది రకరకాలుగా సరోజ. మూడవరోజు చాలా ధైర్యంగా, కేశవ ఇంటి ముందుకొచ్చి నిలుచుంది సరోజ

"కేశవగారూ! రండి బైటకి రండి. మా ఆయన్ని కత్తితో పొడుస్తారో, నామానం మర్యాద తీస్తారో. ధైర్యంగా మీరొక్కరూ రండి" అని సవాలు చేసింది.



ఊరుఊరంతా గజగజలాడారు. ముక్కు మీద వేలు వేసుకున్నారు. శేషు చెయ్యిపట్టి ఇంట్లోకి లాగబోతే విదిల్చి పారేసింది. శాంతమ్మ లోపలికి రమ్మని బ్రతిమాలింది. "ఇంట్లోకి నడవ్వమ్మా!" అని కిష్టయ్యగారు కసిరారు. వాటినీ లక్ష్యపెట్టలేదు సరోజ.

"సాటి సోదరి మానాన్ని తీస్తామంటారా? నేనెం చేశానండీ మిమ్మల్ని! ఛీఛీ విద్య. విజ్ఞానం ఉండీ. నడివీధిలో అలా అంటారా? అసలు ఈ ఊళ్లో వున్న మగవాళ్ళకి బుద్ధిలేదు. ఆడవాళ్ళ కంతకంచెం లేదు" ఆ మాట సరోజ అంటుండే ష్టయ్యగారు లోపలికి వెళ్ళిపోయారు. తిరుపతమ్మ లోపలికి వెళ్ళిపోయింది. అందరూ లోపలికి వెళ్ళిపోయి ముఖాలు దాటు చేసుకున్నారు. తులశమ్మగారు దొడ్డి గుమ్మంలోంచి తొంగి చూస్తోంది.

"రారే మండీ కేశవగారు!" అని గొంతు హెచ్చించి మళ్ళీ పిలిచింది.

లోపల నుంచి లీల, కేశవ ఇద్దరూ వచ్చారు. సరోజ ధైర్యానికి వారికి మూర్ఛ వచ్చినంత పనైంది. "మమ్మల్ని క్షమించు సరోజా" అన్నారు. ఇద్దరు సరోజ చెరో చెయ్యి పట్టుకుని లోపలికి రమ్మని ప్రార్థించారు.

లీలవి చూసి తల వంచేసుకున్నాడు శేషు. సరోజ వాళ్ళింట్లోకి వెళ్ళడానికి సిద్ధపడుతోంది.

"వద్దు సరోజా వద్దు" అన్నాడు శేషు గాబరాగా.

"మీ ఆయన భయపడుతున్నాడు. ఇక్కడే మమ్మల్ని క్షమించి వదిలెయ్యమ్మ. ఏదో పొరబాటు అయిపోయింది. నీ వంటి విద్యావంతులవల్ల ఈ ఊరు మారితే లేనిదేముంది?" అన్నాడు కేశవ.

"ఫరవా లేదన్నయ్యా! నువ్వు మారావు ఊరు మారక పోతుందా. నువ్వు మారడమే నా విజయానికి నాంది. 'రండీ అలా భయపడతారేం?' అని విసురుగా శేషు చెయ్యి పట్టుకుని, లాగి కేశవ ఇంట్లోకి దూరింది సరోజ. ఇదంతా చూసీ, వినీ ఊరంతా విస్తుబోయింది.

## 24

చెరువు గట్టున ఉన్న బంగళా జమిందారులది. దాని తాళాలు కిష్టయ్యగారి దగ్గరున్నాయి. అవి ఆయన్ని అడిగి పుచ్చుకొని. "మాగది తయారయ్యే వరకూ మేం అందులో ఉంటాం మామయ్యా! భోజనానికి మాత్రమే ఇచ్చటికి వస్తాం "చల్ మోహన రంగా" అంది సరోజ. శేషుని తరుముతూ. "ఇదంతా నీ మూలాన్ని కదూ?" అంది చిలిపిగా.

"కాదు నీ మూలాన్నే" అన్నాడు రోషంగా.

పనివాళ్ళు వచ్చి గది శుభ్రం చేశారు. ప్రక్కలు మంచాలు అమర్చారు రాత్రీ. పగలు శృంగారం సాగిద్దామన్నాడు శేషు. "ఛీ ఛీ" అంది సరోజ.

పగలు ఊరి పిల్లలందర్నీ పోగేసి శేషుచదువు. సంగీతం. సరోజ చెబుతున్నారు. రాత్రులు దానిని స్వర్గసీమగా మార్చుకుంటున్నారు.

# రోడ్లపై యవ్వనం

రోడ్లపై ఆటలాడే యవ్వనానికి
జోహార్లు చెబుతావు నువ్వు
పిల్లగాలికి చెదిరిన పైటపై భావగీతాలు
అల్లుతావు నువ్వు
ముడివడిన జడ నీలో మల్లెపూలిన్ని దూస్తుంది
వయసు పొరల్లోని అజ్ఞాత కోరికలన్నీ
పొదల్లోంచి రంగుల్ని చిమ్ముతూ బైటపడతాయి
జనసందోహం నీ జడత్వానికి సవాలు ప్రకటిస్తుంది
రోడ్డు నీచే ప్రణయగీతాలు పాడిస్తుంది
కలువలు తెల్లవీ నల్లవీ-
నీలో తీపిముళ్ళు గుచ్చుతాయి
కళ్ళెక్కడో పారేసుకున్న నువ్వు
శరీరాన్ని రోడ్డుపై బరబరా లాక్కుంటూ పోతావు
రోడ్లమీద ప్రవహిస్తున్న యవ్వనం



నిన్ను తనలోకి లాక్కుంటుంది
ఒక బొట్టు నిన్ను పిలుస్తుంది
ఒక కాటుక కొమ్మ నిన్ను పొడుస్తుంది
ఒక చంద్రగోళం నీ గుండెకాయని కసుక్కున
కరుస్తుంది
కళ్ళు పిలవ్వ గుండెలో గాయం చేస్తాయి
పాదాలు నడవ్వ నీ కళ్ళలో నాట్యాలు చేస్తాయి
నీ మనసు ఆర్ద్రమై
రేగిన ముంగురులు విద్యుత్తీగల్లా నిన్ను
తాకుతాయి
రోడ్ల యవ్వన ప్రవాహం ఆగదు
ఊహల్లో నిన్ను బరబరా ఈడ్చుకుంటూ
పోతుంది.

—డాక్టర్ సుమనశ్రీ

---


కొత్తగది లేస్తోంది పైపైకి. పాత గదులు మారిపోతున్నాయి.

కిష్టయ్యగారికి తిరుపతమ్మ ఇంట్లోకి దూరడానికిభయంగా ఉంది.

రాజుకి ఇంట్లో పేకాట భయంగా ఉంది.

సాంబ తన కొట్టు పాకలోకి మార్చేసాడు.

మునలమ్మగారు దేముణ్ని వంటింటిలోకి మార్చేసింది. దేముని గదిలో పుస్తకాలు ముందేసుకు కూర్చుంటున్నారు బాల, లలితాను.



పాలేర్లు భయభక్తులతో నడుచుకుంటు చకచకా పనులు చేసుకుపోతున్నారు.

రాజుగదికి కిటికీలు లేచాయి. శాంతమ్మగారికి కొత్త గ్యాస్ పొయ్యి వచ్చి, పని తేలిగ్గా హాయిగా ఉంది.

కిష్టయ్యగారు శృంగారాలు చాలించి, ఊరుకి రోడ్డుకి విద్యుత్తు, పొలాలకి మంచి ఎరువులు వగైరాలు వచ్చే ఏర్పాట్లు చూస్తున్నారు.

మంగమ్మ దావా నెగ్గింది. అన్న కూతుర్ని తెచ్చి, అక్క కొడుక్కి పెళ్ళి చేసింది. పాకని ఇల్లు చేసింది.

తిరుపతమ్మ ఇంట్లో స్నానాలు చేస్తోంది.

పార్వతి పెద్ద ఆరిందాఅయిపోయి బావగారితో పరసాలు చాలించింది.

కొత్తగది ఒకటే ఏమిటి? ఇల్లంతా మార్చేస్తేనో—అని అని ఆలోచిస్తున్నారు కిష్టయ్యగారు.

ఈ మార్పులన్నింటికీ కారణం సరోజ ఇంటి బైటకు వచ్చి కేశవని సవాలు చేయడంతో జరిగింది.

అందరికీ ఏదో తెలియని భయం పట్టుకుంది. సరోజ ఏ క్షణంలో వచ్చి సవాలు చేస్తుందో అని.

ఎవరి మటుకు వారు లోపాలు సర్దుకోవడం ప్రారంభించారు.

సూర్యుడు చీకట్లను చీల్చుకొని ఉదయిస్తున్నాడు.

ఉదయరాగం ఆ ఊరును రాగరంజితం చేస్తోంది.

(సమాప్తం)